ఆంధ్రజ్యోతి

ఉష్ణోగ్రత సోమవారం గరిష్ఠం : 36.0 కనిష్ఠం : 25.0

ANDHRAJYOTHY

5

అనంతపురం

జిల్లా వార్తలు

మంగళవారం 1 జూలై 2025



నువ్వే కట్టుకో..!

తల్లి కాలికి కట్టు కడుతున్న కూతురు

కళ్యాణదుర్గం పట్టణానికి చెందిన ఎర్రమ్మ కాలికి గాయమైంది. దీంతో ఆమెను కూతురు లక్ష్మీదేవి స్థానిక సీహెచ్‌సీకి సోమవారం తీసుకువచ్చారు. వైద్యులు ఆమెకు చికిత్స చేయాలి. సిబ్బంది ఆమె కాలికి కట్టు కట్టాలి. తల్లికి కట్టుకట్టే బాధ్యతను కూతురుకు అప్పగించారు సిబ్బంది. 'నువ్వే కట్టు..' అని ఓ ఎఫ్‌ఎన్‌ఓ హూంకరించడంతో ఈ పరిస్థితి తలెత్తింది. ఈ వ్యవహారం సోషల్ మీడియాకు ఎక్కింది. 'ఇంకా నయం.. ఇంజెక్షన్ నువ్వే వేసుకో.. మందులు నువ్వే రాసుకో..' అని చెప్పలేదు..! ప్రభుత్వ ఆస్పత్రుల్లో పరిస్థితులు ఎప్పుడు మెరుగుపడతాయో అని ప్రజలు నిట్టూరుస్తున్నారు.

- ఆంధ్రజ్యోతి, కళ్యాణదుర్గం

కొలువుదీరిన కుళ్లాయిస్వామి పీర్లు



మకానంలో కొలువుదీరిన పీర్లు

నార్పల, జూన్30(ఆంధ్రజ్యోతి): గూగూడు కుళ్లాయిస్వామి పీర్లు సోమవారం కొలువుదీరాయి. ఆలయ ప్రధాన అర్చకుడు హుసేనప్ప.. స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కుళ్లాయిస్వామి దర్శన భాగ్యం కోసం భక్తాదులు సోమవారం ఉదయం నుంచే బారులు తీరారు. స్వామి వారికి చక్కెర, కొబ్బెర ముడుపులు చెల్లించుకున్నారు.

బంగారు గొలుసు సమర్పణ

గూగూడు కుళ్లాయిస్వామికి చాంద్‌బాషా అనే భక్తుడు మూడు తులాల బంగారు గొలుసును అందజేశాడు. సజ్జలదిన్నె గ్రామానికి చెందిన చాంద్‌బాషా గొలుసును ఆలయ కార్యనిర్వహణ అధికారి సాకేతపురం శోభ, ఆలయ ప్రధాన అర్చకుడు హుసేనప్పకు అందజేశాడు.

పారదర్శకతకు
పాతర..!

- అంగట్లో సరుకులా బదిలీలు
- ప్రభుత్వానికి కావాల్సినంత చెడ్డపేరు
- కలెక్టర్ సారూ.. ఉన్నారా..? అసలున్నారా..?



తొలిరోజు నిలదీతలు

అనంతపురం నెట్‌వర్క్, జూన్ 30(ఆంధ్రజ్యోతి): 'పరిపాలన పారదర్శకంగా ఉండాలి. ప్రజలకు జవాబుదారీగా ఉండాలి..' అని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పదే పదే అధికారులకు చెబుతుంటారు. కానీ జిల్లాలో కొందరు ఉన్నతాధికారులకు సీఎం మాటలు ఎక్కినట్లు లేవు. ఏకపక్ష ధోరణి, అవినీతి, ఆశ్రితపక్షపాతంలో నిబంధనలకు తూట్లు పొడుతున్నారు. పారదర్శకతకు పాతరేస్తున్నారు. అందుకు ఉదాహరణ.. సచివాలయ ఉద్యోగుల బదిలీలు. మెరిట్, స్పౌజ్.. ఇవేవీ బదిలీలకు ప్రాతిపదిక కాలేదు. తెరవెనుక ఏం జరిగిందో తెలియదు..! చాలా స్థానాలను బ్లాక్ చేశారు. మెరిట్ జాబితాలో కనీసం తొలి ఐదుగురికి కూడా కోరుకున్న స్థానాలను చూపలేదంటే.. పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. వెల్ఫేర్, పోలీసు, ఆర్‌ఎస్‌కే.. ఇలా ఏదీ పద్ధతిగా సాగలేదు. వెల్ఫేర్‌లో మరీ దారుణంగా వ్యవహరించారు. 'ఆ నియోజకవర్గంలో అడగొద్దు..' అని మైక్ పట్టుకుని (మిగతా 6లో..)

కోరింది కావాలంటే ఎట్లా..?

- మహిళా పోలీసుల బదిలీల్లో వివాదం
- స్పౌజ్ వైపు వెళ్లకుండా నచ్చినచోట కొందరి ఆప్షన్
- అభ్యంతరం తెలిపిన మిగిలిన ఉద్యోగులు
- సచివాలయ మహిళా పోలీసుల బదిలీలు ప్రారంభం
- సిఫార్సు లేఖలతో పారదర్శకతపై అనుమానాలు

అనంతపురం క్రైం, జూన్ 30(ఆంధ్రజ్యోతి): మహిళా పోలీసుల బదిలీల్లో స్పౌజ్ వివాదం తలెత్తింది. దీంతో కొంత సేపు గందరగోళం, సందిగ్ధం నెలకొంది. బదిలీల కౌన్సెలింగ్‌లో కొందరు మహిళా పోలీస్‌లు తమ స్పౌజ్ ఉన్న ప్రాంతం వైపు కాకుండా అనంతపురంలోనే ఆప్షన్ ఇవ్వడంతో మిగిలిన వారు అభ్యంతరం తెలిపారు. దీంతో పోలీస్ ఉన్నతాధికారులు ఆప్షన్లు ఇచ్చిన వాళ్లను మళ్లీ వెనక్కు పిలిచారు. దీంతో కొంత గందరగోళం నెలకొంది. గ్రామ, వార్డు సచివాలయాల్లో పనిచేస్తున్న మహిళా పోలీస్‌లకు సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో ఉదయం 8 గంటల నుంచే కౌన్సెలింగ్ నిర్వహిస్తామని ప్రకటించారు. అయితే 12 గంటలకు కౌన్సెలింగ్ ప్రారంభమైంది. ఉమ్మడి జిల్లా నుంచి వచ్చిన వందలాది మంది మహిళా పోలీసులు కౌన్సెలింగ్‌కు హాజరయ్యారు. సుమారు గంట సేపు కౌన్సెలింగ్ సాజావుగా సాగింది. అయితే హఠాత్తుగా కొందరు స్పౌజ్‌ను దుర్వినియోగం చేశారంటూ అభ్యంతరం తెలిపారు.

స్పౌజ్ వైపు కాకుండా..

కొందరు దరఖాస్తుదారులు తమ భర్త లేదా భార్య(స్పౌజ్) ఉన్న పట్టణం లేదా, దాని సమీప ప్రాంతాలు కాకుండా తమకు నచ్చిన పట్టణాల్లో కోరుకున్నారు. ఒక అభ్యర్థి భర్త హిందూపురంలో ఉంటే...ఆమె అనంతపురానికి ఆప్షన్ ఇచ్చారు. మరో అభ్యర్థి భర్త నార్పలలో ఉంటే ఆమె అనంతపురంలోని సచివాలయానికి ఆప్షన్ ఇచ్చారంటూ అభ్యర్థులు ఆందోళన చేశారు. ఇలా సుమారు నలుగురు ఆప్షన్లు ఇచ్చారంటూ కొందరు మహిళా పోలీసులు అభ్యంతరాలు తెలిపారు. విషయం తెలుసుకున్న ఎస్పీ జగదీష్, డీఎస్పీలు ఆ అభ్యర్థులను వెనక్కు రప్పించి స్పౌజ్ సమస్యపై విచారించారు. తర్వాత కౌన్సెలింగ్‌ను సజావుగా కొనసాగించారు. బయట ఆందోళన చేస్తున్న అభ్యర్థులకు వద్దకు రూరల్ సీఐ శేఖర్, మరికొందరు పోలీసులు వచ్చి బదిలీలు పారదర్శకంగానే జరుగుతున్నాయని, ఎవరూ ఆందోళన చెందవద్దంటూ సముదాయించారు.

ఖాళీలు డిస్‌ప్లే చేయలేదని ఆవేదన..

కౌన్సెలింగ్‌కు ముందు ఖాళీల జాబితా ప్రకటించకపోవడంపై చాలామంది మహిళా పోలీస్‌లు ఆవేదన వ్యక్తం చేశారు. కౌన్సెలింగ్ హాల్‌లోకి వెళ్లే వరకూ ఎక్కడెక్కడ ఖాళీలున్నాయో తెలియని అయోమయ పరిస్థితి ఉందని వాపోయారు. లోపల కౌన్సెలింగ్‌కు వెళ్లిన వాళ్లు ఏ ప్లేస్‌కు ఆప్షన్ ఇచ్చారు..? ఏ ప్లేస్‌లు మిగిలాయో..? తాము ఎక్కడికి ఆప్షన్ ఇవ్వాలో అంటూ హైరానా పడ్డారు. కౌన్సెలింగ్‌లో ఆప్షన్లు తీసుకున్న తర్వాత మిగిలే ఖాళీలు(లెఫ్ట్ ఓవర్ వేకెన్సీలు) చూసేలా బయట డిస్‌ప్లే బోర్డులు కూడా ఏర్పాటు చేయలేదంటూ ఆవేదన వ్యక్తం చేశారు. కొందరు అభ్యర్థులు ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఇతర ప్రజాప్రతినిధులతో 3, 4 సిఫార్సు లేఖలు కూడా ఇచ్చారు. ఈ క్రమంలో బదిలీల పారదర్శకతపై అనేక సందేహాలు కలుగుతున్నాయి. కాగా మధ్యాహ్నం మొదలైన కౌన్సెలింగ్ రాత్రి వరకూ కొనసాగింది.


కౌన్సెలింగ్‌లో వేకెన్సీలు చూస్తున్న మహిళా పోలీసులు


కిటకిటలాడుతున్న డీపీఓ ప్రాంగణం


స్పౌజ్ వివాదంపై అభ్యంతరం చెబుతున్న మహిళా పోలీసులు


తల్లులు కౌన్సెలింగ్‌కు హాజరుకావడంతో పిల్లలను నిద్రపుచ్చుతున్న వారి బంధువులు

'నాయకుల' తీరు సందేహాస్పదం

ఇంజనీరింగ్ అసిస్టెంట్ల బదిలీల్లో యూనియన్ నాయకుల తీరుపై విమర్శలు

అనంతపురం న్యూటౌన్, జూన్ 30(ఆంధ్రజ్యోతి): పంచాయతీరాజ్ విభాగంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్ల బదిలీల్లో యూనియన్ నాయకులు వ్యవహరించిన తీరు సందేహాస్పదంగా మారింది. నాయకులు బాధితుల పక్షమా..? లేక అధికారుల పక్షమా అన్నది అర్థం కాకుండా పోయింది. సోమవారం ఉద్యోగ విరమణ పొందిన ఎస్ఈ జహీర్ అస్లాం ఏక పక్షంగా బదిలీలకు శ్రీకారం చుట్టారన్న ప్రచారం జరుగుతోంది. ఇందులో అనంతపురం ఈఈకి కూడ ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వకుండా శ్రీ సత్యసాయి జిల్లా ఈఈ, ఇన్‌చార్జ్ ఎస్ఈ మురళీకృష్ణ ఆధ్వర్యంలో బదిలీలకు శ్రీకారం చుట్టారన్న విమర్శలు ఉన్నాయి. శ్రీసత్యసాయి జిల్లాలో ఇంజనీరింగ్ అసిస్టెంట్లుగా ఉన్నవారు యూనియన్ నాయకుల పేరుతో బదిలీల విషయంగా చేసిన హడావుడి అంతా ఇంతా కాదు. అయితే అధికారులతో సమావేశమై సోమవారం చర్చలు జరపడం వీరి తీరును సందేహింపజేస్తోంది. మీకు కావాల్సినవి మీరు తీసుకోండి. మా విధులకు అడ్డు తగలద్దండి అనే ఒప్పందానికి వచ్చారన్న ప్రచారం జరుగుతోంది. అయితే సోమవారం వరకు ఎస్ఈ జహీర్ అస్లాం బదిలీల ప్రక్రియ అంతా తానై నిర్వహించారు. మంగళవారం నుంచి ఇన్‌చార్జ్ ఎస్ఈగా ఈఈ ప్రభాకర్‌రెడ్డి బాధ్యతలు చేపట్టనున్నారు. దీంతో నాయకుల నుంచి వచ్చే ఒత్తిళ్లకు బలికావాల్సి వస్తుందన్న ప్రచారం జరుగుతోంది.

దిద్దుబాటు..!

బదిలీల్లో పొరపాట్ల సవరణకు అధికారుల శ్రీకారం

డీపీఓ కార్యాలయానికి క్యూకట్టిన బాధితులు

అనంతపురం న్యూటౌన్, జూన్ 30(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాకు సంబంధించి గ్రేడ్-5 కార్యదర్శులు, గ్రేడ్-6 డిజిటల్ అసిస్టెంట్ల బదిలీల్లో జరిగిన తప్పులను సరిదిద్దే చర్యలకు అధికారులు శ్రీకారం చుట్టారు. తొలి రోజు శనివారం బదిలీల కోసం అధికారులు చేపట్టిన చర్యలపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో తర్వాత కలెక్టర్ ఆదేశాల మేరకు ర్యాంకుల వారిగా కౌన్సెలింగ్‌కు శ్రీకారం చుట్టారు. స్పౌజ్, అనారోగ్య కారణాలు ఇతర సమస్యలతో రెక్వెస్ట్ పెట్టుకున్నవారితో అప్పట్లోనే ఆప్షన్ ఫామ్స్ తీసుకొని పంపించేశారు. ఆప్షన్ ఫామ్స్ ఇచ్చిన వాటిని బ్లాక్ చేయమని గుమాస్తాలకు బాధ్యతలు అప్పగించారు. గుమస్తాలు ఇష్టారాజ్యంగా డిమాండ్ ఉన్నవాటినంటిని బ్లాక్ చేశారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. దీంతో మొదటి ర్యాంకు నుంచే కొన్ని మండలాలకు ఖాళీలు లేవని అధికారులు చెప్పుకుంటూ రావాల్సిన పరిస్థితి నెలకొంది. ఏదో అయిపోయింది. ఇక నుంచి అయిన ర్యాంకుల వారిగా ప్రణాళిక ప్రకారం చేద్దామని నిర్ణయం తీసుకున్న అధికారులకు సిఫార్సు లేఖలు అడ్డు తగిలాయి. సిఫార్సు లేఖలకు అనుగుణంగా ప్లేస్‌మెంట్స్ ఇద్దామంటే అప్పటికే పూర్తి అయిపోయాయి. దీంతో మేము సిఫార్సు లేఖ తెచ్చుకొన్నా తమ స్థానం తమకు కాకుండా మరొకరికి ఎలా ఇస్తారని కొందరు ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే నాయకుల నుంచి అధికారులకు ఫోన్‌లు చేయించినట్లు సమాచారం. దీంతో సిఫార్సు లేఖల ఒత్తిడి ఉన్న స్థానాలకు సంబంధించి సరిదిద్దే ప్రయత్నం చేశారు. స్పౌజ్, ఇతర కేటగిరీల కింద కేటాయించిన వారితో పాటు మొదటి ర్యాంకుకు అనుగుణంగా ప్లేస్‌మెంట్స్ కేటాయించిన వారిని బురిడీ కొట్టించే పన్నాగం పన్నారు. ఇందులో స్పౌజ్ కింద వారికి ర్యాంకు ఉండటంతో ఇవ్వాల్సి వచ్చిందని, ర్యాంకు ఉన్నవారికి స్పౌజ్ కేటగిరి కింద ఇవ్వాల్సి వచ్చిందని చెప్పే ప్రయత్నం చేశారు. అయితే అలా ఎలా జరుగుతుందని ఎదురు తిరిగిన వారితో వినతుల స్వీకరిస్తున్నారు. దీంతో బాధితులు డీపీఓ కార్యాలయానికి క్యూ కట్టారు.

కొడుకు అక్రమంగా ఆస్తి రాయించుకున్నాడు

- అధికారులు స్పందించడం లేదు
- కలెక్టర్‌కు వృద్ధురాలి ఫిర్యాదు


వృద్ధురాలు రామలక్ష్మమ్మ

అనంతపురం కలెక్టరేట్, జూన్ 30(ఆంధ్రజ్యోతి): తన బాగోగులు చూడని కొడుకు ఆస్తినంతా అక్రమంగా బదలాయించుకున్నాడనీ, న్యాయం చేయమంటే రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదని ఓ వృద్ధురాలు.. కలెక్టరేట్‌లో అధికారులకు విన్నవించుకుంది. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదికలో రామలక్ష్మమ్మ వినతిపత్రం అందజేసింది. గతంలో అనంతపురంలోని కళ్యాణదుర్గం రోడ్డులో నివాసముంటున్న తాను ప్రస్తుతం హైదరాబాద్‌లోని కుమార్తె భ్రమరాంబ వద్ద ఉంటున్నానని తెలిపింది. భర్త పర్వతయ్య 2017లో మృతి చెందాడనీ, కుమార్తెలు లలితమ్మ, మల్లీశ్వరి, భ్రమరాంబ, కుమారుడు వెంకటశివయ్య ఉన్నారని చెప్పింది. కుమారుడు వివాహమైనప్పట్నుంచి తమను పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేసింది. ఓ రోజు ఆస్తి డాక్యుమెంట్లు చూస్తానని ఇప్పించుకుని, తాములేని సమయంలో వాటిని తీసుకెళ్లాడని ఆరోపించింది. కొంతకాలానికి తన రెండో కుమార్తె మల్లీశ్వరి మృతిచెందిందని తెలిపింది. తన కుమారుడు దొంగ వీలునామా సృష్టించుకుని, తన భర్త బొటనవేలి ముద్ర వేసుకుని తమ ఆస్తులను అనంతపురం రూరల్ మండలం కక్కలపల్లిలోని సర్వేనెంబరు 29/2లో 9.28 ఎకరాలు, కూడేరు మండలం ఇప్పేరులోని సర్వే నంబరు 722/1, 723/1ఏలోని భూములు రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడని ఆరోపించింది. ఈ విషయంపై కోర్టుకెళితే తమకు అనుకూలంగా తీర్పు వచ్చిందని వివరించింది. బోగస్ ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ ఆధారంగా భూమి ఎక్కించారని ఆరోపించారు. సమస్య పరిష్కరించాలని అనంతపురం రూరల్ మండల తహసీల్దార్ కార్యాలయ అధికారులకు విన్నవించుకుంటున్నా పట్టించుకోవడం లేదని వాపోయింది.

న్యాయం చేయండి

జిల్లా షెడ్యూల్డ్ కులాల సంక్షేమ కార్యాలయంలో గతంలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులుగా పనిచేస్తున్న తమకు న్యాయం చేయాలని పలువురు.. అధికారులను ఆశ్రయించారు. ప్రభాకర్, శివశంకర్, ప్రమీళ, చంద్రశేఖర్, సోమశేఖర్ తదితరులు వినతిపత్రం అందజేశారు. సాంఘిక సంక్షేమ శాఖలో 2007 నుంచి 2016 వరకు పనిచేశామనీ, ఉన్నఫలంగా తొలగించడంతో ఇబ్బందులు పడుతున్నామన్నారు. కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాలు ఇప్పించి, న్యాయం చేయాలని కోరారు.

బదిలీల్లో అన్యాయం...

వార్డు వెల్ఫేర్ సెక్రటరీల బదిలీల కౌన్సెలింగ్‌లో స్పౌజ్ కేటగిరీకి చెందిన కొందరు బోగస్ సర్టిఫికెట్లతో లబ్ధి పొందారని నవోదయకాలనీకి చెందిన శ్రీకాంత్ ఆరోపించాడు. కొందరు అధికారుల సహకారంతోనే ఇలా చేశారన్నారు. బదిలీ ఉత్తర్వులను నిలుపుదల చేయించాలని కోరాడు.

పారదర్శకతకు పాతర..!

(5వ పేజీ తరువాయి)

మరీ ఓ ఉన్నతాధికారి అనౌన్స్ చేసేదాకా పరిస్థితి దిగజారింది. మెరిట్ ప్రకారం పిలిచినా.. తాము కోరుకున్న స్థానాలు జాబితాలో లేకపోవడంతో కొందరు నిలదీశారు. ఆందోళనకు దిగారు. కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. అయినా పరిస్థితిలో మార్పు రాలేదు. మొత్తంగా.. ప్రభుత్వానికి కావాల్సినంత చెడ్డపేరు వచ్చింది. నోరు లేని చిరుద్యోగుల పట్ల ఇంత దారుణం వ్యవహరిస్తుంటే... జిల్లా సర్వోన్నతాధికారి అటువైపు కన్నెత్తి చూడకపోవడం దేనికి సంకేతం..?

చెయాల్సిందంతా చేసి..!

అనంతపురం విద్య, జూన్ 30(ఆంధ్రజ్యోతి): సోషల్ వెల్ఫేర్ అసిస్టెంట్స్ బదిలీలలో చేయాల్సిందంతా చేసిన ఆ శాఖ డీడీ రామాంజినేయులు.. సోమవారం అందుబాటులో లేకుండాపోయారు. 'ఎమ్మెల్యే లెటర్' పేరిట ఆయన బహిరంగంగా హల్‌చల్ చేశారు. మెరిట్ గురించి ఆయన ఏమాత్రం పట్టించుకోలేదు. కొందరు ఎమ్మెల్యేలు సిఫార్సు చేసిన స్థానాలనూ మార్చేసి, ఇష్టారాజ్యంగా వ్యవహరించారని అంటున్నారు. 'మా పేరు చెప్పి ఎందుకు ఇలా చేశారు..?' అని కొందరు ఎమ్మెల్యేలు అధికారులపై అసంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలిసింది. ఇద్దరు ఎమ్మెల్యేలు ఆయనకు ఫోన్ చేసినా, స్విచ్ ఆఫ్ అని వచ్చింది. దీంతో వారు సిబ్బందిని ప్రశ్నించినట్లు సమాచారం. కౌన్సెలింగ్ సోమవారం తెల్లవారజాము వరకూ జరిగిందని, అందుకే ఆయన ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్నారని ఆ శాఖ సిబ్బంది చెప్పుకొచ్చారు. వెల్ఫేర్ అసిస్టెంట్ల బదిలీలలో పెద్ద ఎత్తున డబ్బులు చేతులు మారాయని బాధితులు అంటున్నారు. న్యాయం కోసం పెన్నార్ భవన్‌లో సోమవారం సాయంత్రం వరకు కొందరు పడిగాపులు కాశారు. కానీ డీడీ అందుబాటులోకి రాకపోవడంతో నిరాశతో వెనుదిరిగారు.

చిత్రజ్యోతి

SINCE 1965

లుంగీ కట్టు.. మాస్ లుక్!



కిరణ్ అబ్బవరం, యుక్తి తరేజా జంటగా జైన్స్ నాని తెరకెక్కిస్తోన్న చిత్రం 'కె-ర్యాంప్'. హాస్య మూవీస్, రుద్రాంశ్ సెల్యులాయిడ్ బేనర్లపై రాజేశ్ దండా, శివ బొమ్మకు నిర్మిస్తున్నారు. తాజాగా ఈ చిత్రం నుంచి ఫస్ట్ లుక్ పోస్టర్ రిలీజ్ చేశారు. కిరణ్ అబ్బవరం లుంగీ కట్టులో మాస్, క్లాస్ కలసిన మేకోవర్‌లో ఆకట్టుకుంటున్నారు. బ్యాక్‌గ్రౌండ్‌లో మందు బాటిల్స్‌తో డిజైన్ చేసిన లవ్ సింబల్ కనిపిస్తోంది. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ తుది దశకు చేరుకుంది. ఈ దీపావళికి విడుదల చేసేందుకు చిత్రబృందం సిద్ధమవుతోంది.

ఓటీటీలోకి 'తల్లి మనసు'



కమల్ కామరాజు, సాత్విక్, రచిత మహాలక్ష్మీ ప్రధాన పాత్రల్లో ముత్యాల సుబ్బయ్య తెరకెక్కించిన చిత్రం 'తల్లి మనసు'. ముత్యాల అనంత కిశోర్ నిర్మించారు. ఇటీవలె చిత్రం విడుదలైంది. తాజాగా, ఈ సినిమా ఓటీటీ వేదిక అమెజాన్ ప్రైమ్‌లోకి అందుబాటులోకి వచ్చిందని మేకర్స్ తెలిపారు.

పూజతో ప్రారంభం



తమిళ నటుడు విజయ్ సేతుపతి కథానాయకుడిగా పూరి జగన్నాథ్ ఓ చిత్రాన్ని తెరకెక్కించనున్న సంగతి తెలిసిందే. సోమవారం ఈ చిత్రాన్ని పూజా కార్యక్రమాలతో ప్రారంభించారు మేకర్స్. విజయ్‌కుమార్, సంయుక్త, టబు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఛార్మీ కౌర్ సమర్పణలో పూరి జగన్నాథ్, జేబీ నారాయణరావు కొండ్రోల్లా సంయుక్తంగా సినిమాను నిర్మిస్తున్నారు. పాన్ ఇండియా స్థాయిలో చిత్రాన్ని రూపొందిస్తున్నారు. ప్రేక్షకులకు విభిన్నమైన అనుభూతిని ఈ సినిమా ద్వారా అందిస్తామని మేకర్స్ పేర్కొన్నారు. ఈ నెల నుంచి రెగ్యులర్ షూటింగ్ మొదలు కానుంది.

సున్నితమైన హాస్యంతో...



హీరో రాణా దగ్గుబాటి తన నిర్మాణ సంస్థ స్పిరిట్ మీడియా బ్యానర్‌పై రూపొందిస్తున్న చిత్రం 'కొత్తపల్లిలో ఒకప్పుడు'. నూతన దర్శకురాలు ప్రవీణ పరుచూరి తెరకెక్కిస్తున్నారు. ఈ సినిమా గురించి మేకర్స్ మాట్లాడుతూ "సున్నితమైన హాస్యంతో నిండిన చిత్రమిది. అందర్నీ ఆలోచింపజేస్తుంది. ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని ఇస్తుంది" అని తెలిపారు. ప్రస్తుతం ఈ చిత్రం నిర్మాణ దశలో ఉంది.

కథలో భిన్న కోణాలుంటాయి


\- శ్రీరామ్ వేణు



"తమ్ముడు' సినిమాలో కుటుంబ భావోద్వేగాలు, భిన్న కోణాలు ఉంటాయి. ట్రైలర్‌లో కథ ఎలా ఉండబోతుందో చెప్పాం' అని అన్నారు దర్శకుడు శ్రీరామ్ వేణు. నితిన్ హీరోగా ఆయన దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'తమ్ముడు'. దిల్ రాజు, శిరీష్ నిర్మించారు. ఈ శుక్రవారం థియేటర్లలో విడుదలవుతున్న సందర్భంగా శ్రీరామ్ వేణు మీడియాతో మాట్లాడుతూ 'ఈ చిత్రానికి సెన్సార్ వాళ్లు కొన్ని కట్స్ చెప్పారు. మేము ఆ కట్స్ వద్దనుకున్నాం. సినిమాలో హీరోతోపాటు ఐదుగురు మహిళా క్యారెక్టర్లు బలంగా ఉంటాయి. 'విక్రమ్'లో కమల్ హాసన్ పాత్ర కథలో ఎలా ట్రావెల్ అవుతుందో అలా ఈ చిత్రంలోనూ ఉంటుంది. ఆర్చరీని కథలో చేర్చాలని చాలా సార్లు అనుకున్నాం. 'తమ్ముడు'లో కుదిరింది. ఆర్చరీ ట్రైనర్‌తో నితిన్‌కు 15 రోజులు శిక్షణ ఇప్పించాం. కథలో ప్రధానంగా బ్రదర్ సిస్టర్ సెంటిమెంట్ ఉన్నా అనేక కోణాల్లో మూవీ సాగుతుంది. 'కాంతారా' చూశాక సప్తమి గౌడ మా మూవీలోని క్యారెక్టర్‌కు బాగుంటుందని అనిపించి తీసుకున్నాం. మ్యూజిక్ డైరెక్టర్ అజనీష్ లోకనాథ్ మంచి బ్యాక్ గ్రౌండ్ స్కోర్ ఇచ్చారు.

ఓ దినపత్రికలో వచ్చిన ఆర్టికల్ స్ఫూర్తితో 'తమ్ముడు' కథను సిద్ధం చేసుకున్నా. కథ విని దిల్‌రాజు గారు బడ్జెట్ గురించి ఆలోచించకుండా నిర్మించారు. ఈ కథకు సరిపోయే హీరో కోసం వెతికాం. నితిన్ బాగుంటాడని తీసుకున్నాం. లయ పాత్ర కోసం ఒకప్పటి స్టార్ హీరోయిన్‌కి కథ చెప్పాం. ఆమెకు కథ, క్యారెక్టర్ నచ్చింది. కానీ ఆమె వ్యక్తిగత కారణాల వల్ల నటించలేదు. అయితే మరోసారి ఇలాంటి క్యారెక్టర్ వస్తే తప్పకుండా నటిస్తానని చెప్పారు. నా ప్రతి సినిమా ఒక కొత్త జానర్‌లో ఉంటుంది. నేనెప్పుడూ జానర్ రిపీట్ చేయలేదు. నా స్క్రిప్ట్‌లో ఫిమేల్ క్యారెక్టర్లకు ఎక్కువ ప్రాధాన్యం ఉంటుంది. ఇప్పటి దాకా అలా చేస్తూ వచ్చాను. తరవాత సినిమాకు ఎలా ఉంటుందో ఇప్పుడే చెప్పలేను' అని అన్నారు.

అల్లరి నరేశ్ 'ఆల్కహాల్'



హాస్య చిత్రాలతో తెలుగు ప్రేక్షకుల హృదయాల్లో చెరగని స్థానం సంపాదించుకున్న అల్లరి నరేశ్, వైవిధ్యభరితమైన చిత్రాలతోనూ తనదైన ముద్ర వేస్తున్నారు. అదే కోవలో మరో వైవిధ్యమైన చిత్రంతో అలరించడం కోసం సితార ఎంటర్‌టైన్‌మెంట్స్‌తో చేతులు కలిపారు. 'ఫ్యామిలీ డ్రామా' ఫేమ్ మెహర్ తేజ్ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. ఈ సినిమాకు 'ఆల్కహాల్' అనే టైటిల్ ఖరారు చేశారు. ఈ సందర్భంగా విడుదల చేసిన ఫస్ట్‌లుక్ పోస్టర్ ఆకట్టుకుంటోంది. కాగా, అల్లరి నరేశ్ సరసన రుహాని శర్మ కథానాయికగా నటిస్తున్నారు. ఈ చిత్రానికి సంబంధించిన మరిన్ని వివరాలు త్వరలో వెల్లడించనున్నట్లు చిత్రబృందం పేర్కొంది.

ఆరు పోస్టులకు 171 దరఖాస్తులు

సెక్టోరల్ పోస్టులకు టీచర్ల పోటాపోటీ

అనంతపురం విద్య, జూన్ 30(ఆంధ్రజ్యోతి): సమగ్రశిక్ష అభియాన్(ఎస్ఎస్ఏ)లో సెక్టోరల్ పోస్టులకు టీచర్ల నుంచి తీవ్ర పోటీ నెలకొంది. సోమవారానికి దరఖాస్తు గడువు ముగియడంతో ఉన్న ఆరు పోస్టులకు 171 దరఖాస్తులు వచ్చాయి. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈసారి ఎస్జీ టీచర్లకు అవకాశం ఇవ్వడంతో పోటీ మరింత పెరిగినట్లు సమాచారం. ఏఎంఓ పోస్టుకు 37, అసిస్టెంట్ సీఎంఓ పోస్టుకు 48, అలెస్కో పోస్టుకు 45 దరఖాస్తులు అందినట్లు ఏపీసీ శైలజ తెలిపారు. ఏఎస్ఓ పోస్టుకు 13, అసిస్టెంట్ ఐఈడీ పోస్టుకు14, అసిస్టెంట్ ఏఎంఓ కన్నడ పోస్టుకు 14చొప్పన టీచర్ల నుంచి దరఖాస్తులు అందాయని తెలిపారు. వచ్చిన దరఖాస్తులను ప్రత్యేక బృందం ద్వారా నిబంధనల పరిశీలింపజేస్తున్నారు. ప్రకటనలో ఇచ్చిన మేరకు అన్నీ సక్రమంగా ఉన్న దరఖాస్తులను అర్హత జాబితాలో పెడతారు. ఆతర్వాత ఆయా టీచర్ల పనితీరును పరిగణించి పాయింట్లు కేటాయించి కలెక్టరుకు ఫైల్ పంపుతారు. అక్కడ ఆమోదం లభించిన తర్వాత అధికారికంగా ఎంపికైన అభ్యర్థులను ప్రకటిస్తారు. పోటీ అధికంగా ఉండటంతో దరఖాస్తు దారుల్లో ఉత్కంఠ నెలకొని ఉంది.

వేతనాలొచ్చేశాయ్..!

తాగునీటి పథకం కార్మికులకు జీతాలు, పీఎఫ్ బకాయిల విడుదల

అనంతపురం కలెక్టరేట్, జూన్ 30(ఆంధ్రజ్యోతి): శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం కార్మికులకు ఎట్టకేలకు వేతన వెతలు తీరాయి. కార్మికుల వేతన, పీఎఫ్ బకాయిలు విడుదలైనట్లు కలెక్టర్ వినోద్‌కుమార్ సోమవారం ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని కళ్యాణదుర్గం, రాయదుర్గం నియోజకవర్గాల పరిధిలో పనిచేస్తున్న వారికి రూ.3.74 కోట్లు, మడకశిర నియోజకవర్గానికి సంబంధించి రూ.2.50 కోట్లు ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. 5 నెలల పీఎఫ్ బకాయిలు కూడా విడుదలయ్యాయన్నారు. మిగిలిన బకాయిలు త్వరలో చెల్లిస్తామన్నారు. దీంతో కార్మికులు సమ్మె మానుకుని తాగునీటి సరఫరా పునరుద్ధరించాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి

కుందుర్పి, జూన్ 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎనుములదొడ్డి గ్రామానికి చెందిన కుమార్ (33) అనుమానాస్పద స్థితిలో సోమవారం మృతి చెందాడు. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన మేరకు... కుమార్ తాపీమేస్త్రీ పని చేసేవాడు. ఈక్రమంలో సోమవారం ఉదయం అదే గ్రామానికి చెందిన జోగి హనుమంతప్ప ఇంటి దగ్గర తాపీ పని చేసేందుకు మరో ఇద్దరితో కలిసి వెళ్లాడు. పని చేస్తుండగానే కుప్పకూలి కిందకు పడిపోయాడు. తోటి కూలీలు గమనించి వారి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. గ్రామంలోని ఆర్ఎంపీ సూచనల మేరకు వారు కళ్యాణదుర్గం తరలించారు. అక్కడ వైద్యులు పరీక్షించి మృతి చెందినట్లు తెలిపారు. కుటుంబ సభ్యులు మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకొచ్చారు. కుమార్ తలకు మోకాళ్ల దగ్గర గాయాలు ఉన్నాయని, ఏదో జరిగిందని మృతుడి భార్య త్రివేణి చెప్పడంతో పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకున్నట్లు తెలిపారు. మృతుడికి ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.

కారుణ్య నియామకాలకు చర్యలు

అనంతపురం కలెక్టరేట్, జూన్ 30(ఆంధ్రజ్యోతి): కారుణ్య నియామకాల భర్తీకి తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం ఆయన కారుణ్య నియామకాలపై సమీక్షించారు. నియామకాలకు సంబంధించి అవసరమైన చెక్‌లిస్ట్ తయారు చేయాలన్నారు. రూల్ ఆఫ్ రిజర్వేషన్ తప్పనిసరిగా పాటించాలన్నారు. సమావేశంలో డీఆర్ఓ మలోల, కలెక్టరేట్ ఏఓ అలెగ్జాండర్, డిప్యూటీ తహసీల్దార్‌లు మారుతి, మూర్తి తదితరులు పాల్గొన్నారు.

కారు ఢీకొని వ్యక్తి మృతి

కుమారుడు, తమ్ముడికి గాయాలు


గంగాధర్ (ఫైల్)

పెనుకొండ రూరల్, జూన్ 30(ఆంధ్రజ్యోతి): పెనుకొండ సమీపంలోని ఈశ్వర్ రబ్బర్ ఫ్యాక్టరీ వద్ద సోమవారం కారు.. ద్విచక్రవాహనాన్ని ఢీకొనడంతో ఒకరు మృతిచెందగా.. ఇద్దరు గాయపడ్డారు. ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సోమందేపల్లి మండలం నల్లగొండ్రాయనపల్లికి చెందిన గంగాధర్(42).. తమ్ముడు భాస్కర్, కుమారుడు ప్రణీత్‌తో కలిసి ద్విచక్రవాహనంలో పెనుకొండ వైపు బయల్దేరారు. ఈశ్వర్ రబ్బర్ ఫ్యాక్టరీ వద్దకు రాగానే సోమందేపల్లి నుంచి పెనుకొండ వైపు వస్తున్న కారు.. ద్విచక్రవాహనాన్ని వెనుక నుంచి ఢీకొంది. ప్రమాదంలో గంగాధర్ అక్కడికక్కడే మృతిచెందగా.. భాస్కర్, ప్రణీత్ తీవ్రంగా గాయపడ్డారు. వారిని స్థానికులు 108 వాహనంలో పెనుకొండ ఆస్పత్రికి తరలించారు. భాస్కర్, ప్రణీత్‌ను మెరుగైన వైద్యం కోసం బెంగళూరుకు తరలించారు.

విద్యార్థి అదృశ్యం


మారుతీప్రసాద్‌రెడ్డి

రాప్తాడు, జూన్ 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని మరూరు గ్రామానికి చెందిన మాచిరెడ్డి ఆదినారాయణరెడ్డి కుమారుడు మారుతీప్రసాద్ రెడ్డి కనిపించకుండా పోయాడు. దీనిపై కేసు నమోదు చేసినట్లు రాప్తాడు సీఐ శ్రీహర్ష తెలిపారు. మారుతీప్రసాద్‌రెడ్డి అనంతపురంలోని ఓ ప్రైవేటు కళాశాలలో డిగ్రీ మూడో సంవత్సరం చదువుతున్నాడు. రోజూ మరూరు నుంచి కళాశాలకు వెళ్లి వచ్చేవాడు. ఈనెల 15న ఫోన్ రీచార్జి చేయించుకుంటానని చెప్పి ఇంటి నుంచి వెళ్లాడు. తిరిగి రాకపోవడంతో తల్లితండ్రులు పలుచోట్ల వెతికినా ఆచూకీ దొరకలేదు. గతంలో కూడా రెండుసార్లు ఇంటి నుంచి వెళ్లిపోయి, తర్వాత తిరిగొచ్చాడని కుటుంబీకులు తెలిపారు. డిగ్రీ పరీక్షలు ఎలా రాశావో హాల్‌టికెట్ చూపించమని అడగ్గా ఫెయిల్ అవుతాననే భయంతోనే వెళ్లిపోయి ఉంటాడని తల్లితండ్రులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. తండ్రి ఆదినారాయణరెడ్డి ఫిర్యాదు మేరకు సోమవారం పోలీసులు కేసు నమోదు చేశారు.

నేడు, రేపు వాయిదాపడ్డ డీఎస్సీ పరీక్షలు

అనంతపురం విద్య, జూన్ 30(ఆంధ్రజ్యోతి): యోగాంధ్ర కార్యక్రమం నేపథ్యంలో గతనెల 20, 21 తేదీల్లో వాయిదాపడ్డ డీఎస్సీ పరీక్షలను మంగళ, బుధవారాల్లో నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి ప్రసాద్‌బాబు ప్రకటనలో తెలిపారు. మంగళవారం 2,511 మంది, బుధవారం 2,500 మంది అభ్యర్థులు జిల్లాలో పరీక్షలు రాస్తున్నారన్నారు.

భూలోక సురులు.. వైద్యులు

● నేడు డాక్టర్స్ డే



అనంతపురం వైద్యం, జూన్ 30(ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులు ప్రాణం పోస్తే... పోతున్న ప్రాణాన్ని నిలిపేవాడు వైద్యుడు. అందుకే వైద్యుడిని నడయాడే దేవుడిగా చాలా మంది కీర్తిస్తారు. తన వ్యక్తిగత సుఖాలను త్యాగం చేసి బాధితుల రోగం నయం చేసేవాడు డాక్టర్. నిరంతరం ఎన్నో ఒత్తిడుల మధ్య వైద్య వృత్తిని నిర్వహించే వైద్యులకు సమాజం కృతజ్ఞతలు తెలుపుకోవాల్సిన అవసరం ఉంది. ప్రఖ్యాత వైద్యుడు, పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ బిధాన్ చంద్రరాయ్ జనన, మరణ దినాలను పురస్కరించుకుని కేంద్ర ప్రభుత్వం జూలై ఒకటో తేదీని డాక్టర్ డేగా ప్రకటించింది.


మూడు తరాల వైద్యం..



మా అమ్మనాన్న డాక్టర్లుగా పనిచేసి ప్రజల్లో మనన్న పొందారు. వారి బాటలోనే మేము, మా పిల్లలు వైద్యవృత్తిని ఎంచుకుని సేవలందిస్తున్నాం. ఫార్మాకాలజీ ప్రొఫెసర్‌గా, మెడికల్ కాలేజ్ ప్రిన్సిపాల్‌గా మరిన్ని సేవలు అందించేందుకు ప్రభుత్వం అవకాశాన్ని కల్పించింది. పరిపాలనా విభాగంలోనూ సంస్కరణలు తీసుకువచ్చి మరింత సులువుగా ప్రజలకు వైద్యసేవలందించేందుకు ఇదో చక్కని అవకాశం.

- డాక్టర్ షారోన్ సోనియ, ఫార్మాకాలజీ ప్రొఫెసర్

కొందరికే అవకాశం..



వైద్యవృత్తిలో పేదలకు సేవచేసే భాగ్యం సమాజంలోని కొందరికి మాత్రమే దక్కిన అవకాశం. అందులో మేము భాగస్వాములు కావడం అదృష్టంగా భావిస్తున్నాం. కీళ్లు, ఎముకల విభాగం ప్రొఫెసర్‌గా ఎన్నోరకాల శస్త్రచికిత్సలు చేశాం. ప్రమాదాలకు గురైనప్పుడు భరించలేని బాధితో బాధితులు డాక్టర్ల వద్దకు వస్తారు. సరైన చికిత్సతో వారి బాధ పోగొట్టి, సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఇంటికి పంపేటప్పుడు వారి కళ్లలో కనిపించే ఆనందాన్ని వర్ణించలేం.

- డాక్టర్ ఆత్మారామ్, ఆర్థోపెడిక్ ప్రొఫెసర్

స్టార్ హాస్పిటల్ స్థాయిలో..



మెట్రోనగరాల్లోని స్టార్ హాస్పిటల్స్ స్థాయిలో న్యూరోసర్జరీ శస్త్ర చికిత్సలు చేస్తున్నాం. ప్రభుత్వ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్లో మూడు సంవత్సరాల కిందట అన్ని సౌఖర్యాలతో న్యూరో సర్జరీ విభాగాన్ని ప్రారంభించాం. యాక్సిడెంట్, బ్రెయిన్ ట్యూమర్, పక్షవాతం తదితర కేసులకు దాదాపు వెయ్యికి పైగా మేజర్ సర్జరీలు చేశాం. ప్రతిఒక్కదానికి అపరేషన్ చేయగల పరికరాలున్నాయి. ప్రజల్లో సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌పై మంచి గుర్తింపును తీసుకువచ్చాం.

- డాక్టర్ భాస్కర్, న్యూరో సర్జరీ ప్రొఫెసర్

ప్రాణాలను ఫణంగా పెట్టి..



సమాజంలో కొవిడ్ వంటి మహమ్మారులు విజృంభించినపుడు డాక్టర్లు తమ ప్రాణాలను ఫణంగా పెట్టి పని చేస్తారు. వృత్తిలో భాగంగా రోజు వారి జీవన్మరణ నిర్ణయాలు తీసుకోవడంలో మానసిక ఒత్తిడిని ఎదుర్కోవాల్సి ఉంటుంది. ప్రతి రోగ నిర్ధారణ, చికిత్స ప్రణాళిక వెనుక, మనల్ని ఆరోగ్యంగా ఉంచడానికి 24 గంటలూ పనిచేసే నిబద్ధత కలిగిన వైద్యులు ఉన్నారని గుర్తుంచుకోవాలి. ఈ నిపుణులు మనసమాజ నిర్మాణానికి ఎంత అవసరమో వర్ణించలేం.

- డాక్టర్ ఈబీ దేవి, జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి

ఉచితంగా గుండె ఆపరేషన్లు..



ప్రభుత్వ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్లో ఖరీదైన గుండె ఆపరేషన్లు ఉచితంగా చేస్తున్నాం. ఐవీయూఎస్ ఆపరేషన్‌కు రూ.5లక్షల నుంచి రూ.7లక్షల వరకు అవుతుంది. ఇలాంటివి 80 ఆపరేషన్లు చేశాం. అదేవిధంగా హార్ట్ రేట్ తక్కువున్న వారికి పేస్‌మేకర్ మిషన్‌ను అమర్చుతాం. ఒక్కో ఆపరేషన్‌కు రూ.3లక్షల నుంచి రూ.4లక్షల వరకు ఖర్చు అవుతుంది. కార్నరీ యాంజియోగ్రామ్ 1200, కార్నరీ యాంజియోప్లాస్టీ 450 ఆపరేషన్లు విజయవంతంగా పూర్తి చేశాం. డాక్టర్‌గా పేదలకు ఇలాంటి సేవ చేయడం వరంగా భావిస్తాం.

- డాక్టర్ సుభాష్ చంద్రబోస్, కార్డియాలజీ అసోసియేట్ ప్రొఫెసర్

థ్యాంక్స్ ఒక ప్రోత్సాహం..



ఒక పేషెంట్ రీకవరీ అయిన తరువాత డాక్టర్‌కు థ్యాంక్స్ చెప్తారు. ఈ పదం డాక్టర్లకు ఎంతో ప్రోత్సాహాన్ని ఇస్తుంది. పదిమందికి సాయం చేయడానికే వైద్యవృత్తిని ఎంచుకున్నా. గత 22 సంవత్సరాలుగా సేవలందిస్తూ వస్తున్నా. డిపార్ట్‌మెంట్‌ను బాగా అభివృద్ధి చేయాలని ప్రభుత్వ సర్వజన వైద్యశాల డిప్యూటీ ఆర్ఎంఓగా పనిచేస్తున్నా. జీవితాన్ని ప్రసాదించిన ఆసుపత్రికి తిరిగా సేవ చేసే భాగ్యం దొరకడం అదృష్టంగా భావిస్తున్నా. ఒక పేషెంట్‌ను రీకవరీ చేయాలంటే అన్నిరకాల వనరులు ఉంటేనే బాగు చేయగలం.

- డాక్టర్ హేమలత, డిప్యూటీ సివిల్ సర్జన్

దేనికైనా రెడీ..!

ఎక్కడికి రావాలో చెప్పు..!

జేసీ ప్రభాకర్ రెడ్డికి పెద్దారెడ్డి సవాలు


ఎస్పీ కార్యాలయం వద్ద మీడియాతో మాట్లాడుతున్న పెద్దారెడ్డి

అనంతపురం క్రైం, జూన్ 30(ఆంధ్రజ్యోతి): 'నేను దేనికైనా రెడీ..! ఆయన ఎక్కడికొస్తాడో రమ్మను. ఎక్కడికి రావాలో ఆయనే చెప్పినా పరవాలేదు..' అని జేసీ ప్రభాకర్ రెడ్డికి మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డి సవాలు విసిరారు. వైసీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి, మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్, మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి, వైసీపీ నాయకుడు వెన్నపూస రవీంద్రారెడ్డితో కలసి ఆయన సోమవారం ఎస్పీ జగదీష్‌ను కలిశారు. తాడిపత్రిలో వైసీపీ 'రీకాల్' కార్యక్రమం నిర్వహించేందుకు మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డికి అనుమతి ఇవ్వాలని నాయకులు ఎస్పీని కోరారు. వినతిపత్రం తీసుకున్న ఎస్పీ, పరిశీలిస్తామని అన్నారు. అనంతరం వైసీపీ నాయకులు మీడియాతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఏడాదిలో ప్రజలను మోసం చేసిందని అనంత అన్నారు. అందుకే 'రీకాల్ చంద్రబాబు మేనిఫెస్టో' నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమం నిర్వహణ కోసం పెద్దారెడ్డి తాడిపత్రికి వెళితే పోలీసులు అడ్డుకుని, అనంతపురం తీసుకొచ్చి వదిలేశారని అన్నారు. తాడిపత్రిలో ఎందుకు ప్రత్యేక పరిస్థితులున్నాయో అర్థం కావడం లేదని అన్నారు. పోలీసు యంత్రాంగం పెద్దారెడ్డికి అనుమతి ఇవ్వాలని, లేకుంటే ఏం చేయాలో కార్యాచరణ ప్రకటిస్తామని హెచ్చరించారు. అనంతరం పెద్దారెడ్డి మాట్లాడుతూ, తాడిపత్రిలో తనను అడుగు పెట్టకుండా చూస్తున్నారని అన్నారు. 'నా ఇంటి దగ్గరకొచ్చిన వాళ్లను రప్పా రప్పా నరుకుతా అంటున్నాడు. మా కార్యకర్త షాప్‌ను ధ్వంసం చేశారు. వైసీపీ వాళ్లపై కేసులు నమోదు చేస్తున్నారు. నన్ను సొంత ఇంటికి పోనివ్వడం లేదు. సీఎం ఆదేశాలున్నాయా...? లేక పోలీసులే ఇలా చేస్తున్నారా? లేక వీళ్ల బాస్ జేసీ ప్రభాకర్ రెడ్డి చెబుతున్నారా..?' అని ప్రశ్నించారు. తాను గతంలో దౌర్జన్యాలు చేశానని అంటున్నారని, దీనిపై బహిరంగ చర్చకు సిద్ధమని అన్నారు. 'మా పార్టీ వాళ్లను శాసించడానికి నువ్వెరు..? ఆఫ్టరాల్ మున్సిపల్ చైర్మన్‌వి' అని మండిపడ్డారు. తాడిపత్రిలో ప్రజాస్వామ్యం, రాజ్యాంగం ఖూనీ అయ్యాయని మాజీ ఎంపీ మాధవ్ అన్నారు. జిల్లాలో ఒకప్పుడు ఫ్యాక్షనిజం, రౌడీయిజం లేకుండా పోలీసు వ్యవస్థ పనిచేస్తే.. ప్రస్తుతం కొత్త తరహాలో పనిచేస్తోందని విమర్శించారు.

వెంట వచ్చారో..!


చేతిలో తుపాకీతో సీఐ సాయిప్రసాద్

తాడిపత్రి, జూన్ 30(ఆంధ్రజ్యోతి): పెద్దారెడ్డి రాకతో రెండు రోజుల క్రితం తాడిపత్రిలో ఉద్రిక్తత తలెత్తిన విషయం తెలిసిందే. పోలీసులు ఆయనను తిరిగి అనంతపురం తరలిస్తుండగా వైసీపీ కార్యకర్తలు పోలీసుల వాహనాన్ని వెంబడించే ప్రయత్నం చేశారు. దీంతో శాంతిభద్రతల సమస్య తలెత్తుతుందని పోలీసులు భావించారు. వారిని హెచ్చరించేందుకు పట్టణ సీఐ సాయిప్రసాద్ పిస్టల్ చేతిలోకి తీసుకున్నారు. ఎవరూ వెంట రావద్దని హెచ్చరించారు. ఈ దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి.

ఇరువర్గాలపై కేసు నమోదు

మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి తాడిపత్రికి వచ్చిన సమయంలో ఆయన ఇంటి వద్ద, మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి ఇంటి వద్ద భారీ ఎత్తున వారి వర్గీయులు పోగయ్యారు. శాంతిభద్రతల సమస్య తలెత్తేలా వ్యవహరించినందుకు పోలీసులు రెండు వర్గాలవారిపై కేసులు నమోదు చేశారు. వైసీపీ మద్దతుదారులు హనుమంతరెడ్డి, రవితేజారెడ్డి, బ్రహ్మానందరెడ్డి, ప్రవీణ్ కుమార్ రెడ్డి తదితరులు, టీడీపీ మద్దతుదారులు కొత్తపల్లి మల్లికార్జున, సుదర్శన్‌రెడ్డి, పరమేశ్, ఖాదర్, యాసీన్ తదితరులపై సుమోటోగా కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.

బంగారం తాకట్టు పెట్టిన సొమ్ము దొంగలపాలు..!

ఉరవకొండలో పగలే రెండుచోట్ల చోరీలు

రూ.2.26 లక్షల నగదు అపహరణ


విచారణ చేస్తున్న కానిస్టేబుల్

ఉరవకొండ, జూన్30(ఆంధ్రజ్యోతి): బ్యాంకుల్లో బంగారం తాకట్టుపెట్టి తీసుకున్న డబ్బును దుండగులు చోరీ చేసుకెళ్లారు. పట్టణంలో సోమవారం పగలే రెండు చోరీలు జరిగాయి. ద్విచక్ర వాహనాల్లో ఉంచిన రూ.2.26 లక్షలను గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. పోలీసు స్టేషన్‌కు కూతవేటు దూరంలో ఒకటి, టవర్‌క్లాక్ కూడలిలో మరొకటి జరిగాయి. మండలంలోని మోపిడి గ్రామానికి చెందిన గొర్తి శ్రీనివాసులు పోలీసు స్టేషన్ ఎదురుగా ఉన్న యూనియన్ బ్యాంకులో రెండు తులాల బంగారాన్ని తాకట్టు పెట్టి రూ.88వేల నగదు తీసుకున్నాడు. బ్యాంకు ముందే ద్విచక్రవాహనంలో డబ్బు పెట్టి, పక్కన మరొకరితో మాట్లాడుతుండగా.. గుర్తుతెలియని దుండగుడు ఎత్తుకెళ్లాడు. విడపనకల్లు మండలం చీకలగుర్కి గ్రామానికి చెందిన ఓబులేసు పంట పెట్టుబడి కోసం మూడు తులాల బంగారాన్ని బ్యాంకులో తాకట్టు పెట్టగా వచ్చిన వచ్చిన డబ్బును ద్విచక్రవాహనంలోని బ్యాగులో ఉంచాడు. భార్యతో కలిసి కూరగాయలు కొనేందుకు టవర్‌క్లాక్ వద్దకు వెళ్లారు. ఇదే అదునుగా భావించిన దుండగులు వాహనంలో ఉన్న రూ.1.38 లక్షలను అపహరించుకువెళ్లారు. బ్యాంకుల్లో రుణాల రెన్యువల్, సోమవారం కావడంతో రద్దీని దృష్టిలో ఉంచుకుని చోరీలు చేసి ఉండవచ్చన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. బాధితుల ఫిర్యాదుల మేరకు పోలీసులు కేసులు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నారు.

అస్వస్థతతో రైతు మృతి


లక్ష్మీనారాయణ (ఫైల్)

చెన్నేకొత్తపల్లి జూన్ 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని న్యామద్దల గ్రామానికి చెందిన రైతు లక్ష్మీనారాయణ (53) అస్వస్థతతో సోమవారం మరణించాడు. గ్రామస్థులు తెలిపిన వివరాల మేరకు.. లక్ష్మీనారాయణ 3 ఎకరాల్లో మొక్కజొన్న సాగుచేశాడు. ఉదయం పంటకు క్రిమిసంహారక మందు పిచికారీ చేసి, ఇంటికొచ్చాడు. కొద్దిసేపటి తరువాత ఉన్నఫలంగా అస్వస్థతకు లోనయ్యాడు. వెంటనే కుటుంబసభ్యులు చెన్నేకొత్తపల్లి ప్రభుత్వాస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. రైతుకు భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.

కాలేజీకి వెళ్లుంటే.. బతికేవాడివే..!

ట్రాక్టర్ కింద పడి విద్యార్థి మృతి

కన్నీరుమున్నీరైన తల్లిదండ్రులు


జశ్వంత్ (ఫైల్)

లేపాక్షి, జూన్ 30(ఆంధ్రజ్యోతి): కాలేజీకి వెళ్లాల్సిన విద్యార్థి.. రేపు వెళ్తానని చెప్పి సరదాగా బయటికెళ్లాడు. స్నేహితుడు ట్రాక్టర్ నడుపుతుండగా.. అతడి వెంట వెళ్లాడు. ట్రాలీ వద్ద నిల్చుని వెళ్తూ.. పట్టుతప్పి పడిపోయాడు. ట్రాలీ కింద పడి చనిపోయాడు. ఒక్కగానొక్క కుమారుడి మృతితో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు. 'కాలేజీకి వెళ్లుంటే బతికేవాడివి కదా..' అంటూ రోదించారు. మండలంలోని ఉప్పరపల్లిలో సోమవారం ట్రాక్టర్ కింద పడి డిప్లొమా విద్యార్థి జశ్వంత్ (17) మృతిచెందాడు. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన శ్రీనివాసులు, శ్రీలత దంపతులకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమారుడు జశ్వంత్ మదనపల్లిలోని ఓ ప్రైవేటు కళాశాలలో డిప్లొమా ద్వితీయ సంవత్సరం చదువుతుండేవాడు. సెలవులు కావడంతో ఉప్పరపల్లికి వచ్చాడు. సోమవారం కాలేజీకి వెళ్లాల్సి ఉండగా ఈరోజు ఇంట్లో ఉండి మంగళవారం వెళ్తానని తల్లిదండ్రులను ఒప్పించాడు. ఇదే సమయంలో గలిబిపల్లి చెరువు నుంచి ట్రాక్టర్లతో పొలాలకు మట్టిని తోలుతున్నారు. ఓ ట్రాక్టర్‌కు తన స్నేహితుడు డ్రైవర్‌గా వెళ్తుండడంతో జశ్వంత్ కూడా వెళ్లాడు. ట్రాలీ వద్ద నిల్చుని వెళ్తుండగా పట్టుతప్పి కిందపడ్డాడు. విద్యార్థిపై ట్రాలీ వెళ్లడంతో తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే హిందూపురం ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. ఒక్కగానొక్క కుమారుడు మృతిచెందడంతో తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి. ప్రమాదంపై లేపాక్షి పోలీసులు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నారు.

పోక్సో కేసులో వృద్ధుడి అరెస్టు

యాడికి, జూన్30(ఆంధ్రజ్యోతి): మండలంలో ఏడేళ్ల బాలికపై అత్యాచారానికి యత్నించిన 55 ఏళ్ల ఆదెప్పను సోమవారం అరెస్టు చేసినట్లు సీఐ ఈరన్న తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. ఆదివారం రాత్రి ఆడుకుంటున్న బాలికపై ఆదెప్ప అత్యాచారానికి యత్నించాడు. పసిగట్టిన బాలిక తల్లిదండ్రులు.. అతడికి దేహశుద్ధి చేశారు. ఆదెప్ప తప్పించుకుని, పారిపోయాడు. దీనిపై బాలిక తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. ఆ మేరకు ఆదెప్పను అరెస్టు చేసినట్లు సీఐ వివరించారు.

ప్రాణం తీసిన వివాహేతర బంధం

● హత్య కేసును ఛేదించిన పోలీసులు ● నిందితులు అన్నదమ్ములు

హిందూపురం, జూన్ 30(ఆంధ్రజ్యోతి): పురం ప్రాంతంలో సంచలనం సృష్టించిన మొండెం, తల వేరుచేసిన హత్యకేసును పోలీసులు ఛేదించారు. ఈ కేసులో ఇద్దరు నిందితులను అరెస్టు చేశారు. వివాహేతర సంబంధమే హత్యకు కారణమని పోలీసులు నిర్ధారించారు. హత్యకేసు వివరాలను సోమవారం స్థానిక తన కార్యాలయం వద్ద డీఎస్పీ మహేష్ వెల్లడించారు. లేపాక్షి మండలం మైదుగోళం గ్రామానికి చెందిన రవికుమార్ అదే ఊరికి చెందిన బోయ ఆనంద్ భార్య శాంతమ్మతో కొంతకాలంగా వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. విషయం తెలిసిన బోయ ఆనంద్, అతడి తమ్ముడు గోవిందరాజులు పలుసార్లు రవికుమార్‌ను హెచ్చరించారు. అయినా రవికుమార్ మారలేదు. దీంతో అతడిని హతమార్చాలని పథకం పన్నారు. అందులో భాగంగా ఆనంద్, గోవిందరాజులు ఈనెల 24న సాయంత్రం రవికుమార్‌ను మద్యం తాగడానికి రమ్మన్నారు. ఇందుకు ఒప్పుకుని ఇంటి నుంచి చికెన్ చేయించుకుని వెళ్లారు. గ్రామ సమీపంలోని బీడు భూమిలో కూర్చుని మద్యం తాగించారు. రాత్రి 10 గంటల సమయంలో రవికుమార్ మత్తులోకి జారుకోవడంతో అదే అదనుగా భావించి అప్పటికే ఆ ప్రాంతంలో దాచి ఉన్న వేటకొడవలి తీసుకొచ్చి గోవిందరాజు అతికిరాతకంగా నరికి తల, మొండెం వేరుచేశారు. తలను ప్లాస్టిక్ సంచిలో వేసి పక్కనే ఉన్న నీటికుంటలో పడేశారు. మొండెం అక్కడే వదిలేసి వెళ్లిపోయారు. ఈనెల 25న సాయంత్రం రవికుమార్ తండ్రి అశ్వత్థప్ప లేపాక్షి పోలీసు స్టేషన్‌లో తన కుమారుడు కనిపించడంలేదని ఫిర్యాదు చేశాడు. పోలీసులు మొదట మిస్సింగ్ కేసుగా నమోదు చేశారు. రవికుమార్‌ను హత్య చేశారని 26న ఉదయం అతడి భార్య గీత.. లేపాక్షి పోలీసులకు ఫిర్యాదు చేసింది. గ్రామ సమీపంలో మృతదేహం ఉందని తెలిపింది. దీంతో హత్యకేసుగా మార్చిన పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. నీటి కుంటలో ఉన్న తలను తీసుకుని శవపంచనామా చేయించి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. డీఎస్పీ మహేష్, రూరల్ సీఐ జనార్దన్, ఎస్ఐ నరేంద్ర.. నిందితుల కోసం గాలింపు చేపట్టారు. ఆదివారం మధ్యాహ్నం మైదుగోళం గ్రామ సమీపంలో ఉండగా నిందితులిద్దరిని అదుపులోకి తీసుకుని విచారించగా నేరాన్ని అంగీకరించారు. వారిరువురిని అరెస్టు చేశారు సమావేశంలో సీఐలు జనార్దన్, అబ్దుల్‌కరీం, ఎస్ఐలు నరేంద్ర, మునీర్‌అహ్మద్ పాల్గొన్నారు.

నేడు పింఛన్ల పంపిణీ: డీఆర్‌డీఏ పీడీ

అనంతపురం అర్బన్, జూన్ 30(ఆంధ్రజ్యోతి): జూలై నెలకు సంబంధించి మంగళవారం ఉదయం నుంచి ఇంటి వద్దనే లబ్ధిదారులకు పింఛన్ సొమ్ము పంపిణీ చేయనున్నట్లు డీఆర్‌డీఏ పీడీ శైలజ పేర్కొన్నారు. జూలై నెలకు సంబంధించి జిల్లాలోని 2,80,355 మంది లబ్ధిదారులకు రూ.124.74 కోట్ల పింఛన్ సొమ్ము ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. ఉదయం 7 గంటల నుంచి పింఛన్ల సొమ్మును లబ్ధిదారుల ఇంటి వద్దకే సిబ్బంది వెళ్లి అందజేస్తారన్నారు. మంగళ, బుధవారాల్లో రెండురోజులు పింఛన్ సొమ్మును అందజేస్తారన్నారు. తొలిరోజే పూర్తి చేయాలని ఆదేశించామన్నారు. తొలి రోజు తీసుకోనివారు మరుసటి రోజు సచివాలయం వద్దకు వెళ్లి మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు పింఛన్ సొమ్ము తీసుకోవాలని సూచించారు.

డిగ్రీ అడ్మిషన్లు వెంటనే చేపట్టండి: ఏఐఎస్ఎఫ్

అనంతపురం విద్య, జూన్30(ఆంధ్రజ్యోతి): విద్యాసంవత్సరం ముగిసి కళాశాలలు తెరుచుకున్నా ఇప్పటికీ డిగ్రీ అడ్మిషన్లు చేపట్టకపోవడం దారుణమని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కుళ్లాయిస్వామి మండి పడ్డారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఇంటర్ పూర్తిచేసిన విద్యార్థులు డిగ్రీలో చేరేందుకు ఎంతో ఆశతో ఎదురుచూస్తున్నారన్నారు. ఉన్నతవిద్యామండలి, విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కోల్డ్‌వార్ నడుపుతూ విద్యార్థుల జీవితాలతో ఆడుకుంటున్నారని వాపోయారు. విద్యాశాఖ మంత్రి నారాలోకేష్ చొరవతీసుకొని డిగ్రీఅడ్మిషన్లకు తగిన చర్యలు చేపట్టాలన్నారు. లేదంటే ఏఐఎస్ఎఫ్ ఆందోళనలు చేపడుతుందని హెచ్చరించారు. నాయకులు మంజునాథ్, వంశీ, చందు, విజయ్ పాల్గొన్నారు.

బదిలీల్లో అవకతవకలను సరిదిద్దాలి

అనంతపురం క్లాక్‌టవర్, జూన్ 30(ఆంధ్రజ్యోతి): గ్రామ-వార్డు సచివాలయాల ఉద్యోగుల బదిలీలలో జరిగిన అక్రమాలను సరిచేసి, విచారణ చేయాలని ఏపీ విలేజ్-వార్డు సెక్రటేరియట్ సర్వీసెస్ అసోసియేషన్ నాయకులు కోరారు. ఈ మేరకు స్థానిక రామ్‌నగర్‌లోని ఆర్‌డీఎంఏ కార్యాలయం వద్ద సోమవారం కొద్దిసేపు నిరసన తెలిపారు. అనంతరం మున్సిపల్ ఆర్డీ విశ్వనాథ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మహబూబ్‌బాషా, నరసింహారావు, గౌరవాధ్యక్షుడు రాఘవరెడ్డి, నాయకులు, బాధిత సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

రిటైర్డ్ అధికారులకు ఘన సన్మానం



సన్మాన సభలో మాట్లాడుతున్న ఎస్ఈ సురేష్

అనంతపురం న్యూటౌన్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): ఆర్‌డబ్ల్యూఎస్ విభాగంలో ఈఈ మురళీధర్‌రావు వలంటరీ రిటైర్మెంట్ తీసుకోగా.. ఎస్ఈటూ పీఏ రంగయ్య ఉద్యోగ విరమణ పొందారు. వీరితో పాటు సూపరింటెండ్ ఉషారాణి, డీఏఓ మునీంద్ర సోమవారం రిటైర్డ్ అయ్యారు. దీంతో వీరందరికీ ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయ ఆవరణలో సన్మానం చేశారు. ఎస్ఈ సురేష్, డీఈలు శ్రీరాములు, శ్రీధర్, రెహనావసీం, శ్రీనివాసులతో పాటు పలువురు ఏఈఈలు, జేఈలు పాల్గొని వారికి పూలమాలలు వేసి శాలువాలు కప్పి ఘనంగా సత్కరించారు. అనంతరం విధినిర్వహణలో వారి సేవల్ని కొనియాడారు.

ఎస్ఈకే ఇన్‌చార్జి ఈఈ బాధ్యతలు

అనంతపురం న్యూటౌన్: ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ మురళీధర్‌రావు వలంటరీ రిటైర్మెంట్ తీసుకోవడంతో ఆ ఇన్‌చార్జి బాధ్యతలను ఎస్ఈ సురేష్‌కు అప్పగించారు. అదేవిధంగా ఎస్ఈ టూ పీఏ డీఈ రంగయ్య రిటైర్డ్ అవడంతో ఆ బాధ్యతలను రాయదుర్గం డీఈ రామారావుకు అప్పగించారు. సూపరింటెంట్ ఉషారాణి రిటైర్డ్ అవడంతో ఆర్‌డబ్ల్యూఎస్ విభాగానికి చెందిన సూపరింటెంట్ ఎర్రిస్వామి డ్వామాలో డిప్యూటేషన్‌పై ఉన్నారు. అయితే ఆయనకే సూపరింటెంట్ బాధ్యతలు అప్పగించారు. ఇక డీఏఓగా ఉన్న మునీంద్ర రిటైర్డ్ అవడంతో ఆ బాధ్యతలను పీఆర్ పీఐయూ విభాగంలో డీఏఓగా ఉన్న పద్మావతికి ఇన్‌చార్జి ఇచ్చారు. ఇప్పటి వరకు పెనుకొండ ఇంచార్జ్ ఈఈ గా మురళీధర్‌రావు ఉండేవారు. ఆయన వలంటరీ రిటైర్మెంట్ కావడంతో ఆ స్థానంలో రషీద్‌ఖాన్‌ను నియమించారు.

పంపనూరు ఆలయ హుండీ ఆదాయం లెక్కింపు

ఆత్మకూరు జూన్ 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని పంపనూరు సుబ్రమ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో హుండీ కానుకల్ని సోమవారం లెక్కించారు. మూడునెలల పాటు భక్తులు హుండీల ద్వారా సమర్పించిన కానుకల్ని లెక్కించగా.. 12,74,558 రూపాయల ఆదాయం వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి బాబు తెలిపారు. అనంతపురం డివిజన్ పర్యవేక్షణఅధికారి వన్నూర్ స్వామి సమక్షంలో హుండీ లెక్కింపు చేసినట్లు తెలిపారు. ఈ ఆదాయాన్ని దేవాదాయ శాఖకు జమచేస్తున్నట్లు పేర్కొన్నారు.

బావిలో పడి వ్యక్తి మృతి



సత్యనారాయణ మృతదేహం

నార్పల, జూన్ 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని నిలువు రాయి గ్రామంలో సోమవారం బావిలో పడి సత్యనారాయణ(50) అనే వ్యక్తి మృతి చెందాడు. నిలువు రాయి గ్రామానికి చెందిన సత్యనారాయణ అదే గ్రామానికి చెందిన రైతు పొలంలో కూలీ పనులకు వెళ్లాడు. అక్కడ మధ్యాహ్న సమయంలో భోజనం చేసి నీళ్లు తాగేందుకు సమీప బావిలోకి దిగాడు. సరిగ్గా అదే సమయానికి మూర్ఛ రావడంతో నీళ్లలోకి పడ్డాడు. తోటి కూలీలు కాపాడడానికి ప్రయత్నం చేయగా అతను అప్పటికే మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. భార్య నరసమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సాగర్ తెలిపారు.

అక్రమంగా మట్టిని తరలిస్తే చర్యలు

గార్లదిన్నె, జూన్ 30(ఆంధ్రజ్యోతి): అనుమతులు లేకుండా మట్టిని తరలిస్తే చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ బండారు ఈరమ్మ సోమవారం ప్రకటనలో హెచ్చరించారు. మండలంలోని గ్రామాల్లో చెరువులు, ప్రభుత్వ భూముల నుంచి ఎవరైనా అనుమతులు లేకుండా మట్టిని తరలిస్తే.. చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అన్నారు. భూములు సారవంతం కోసం చెరువు మట్టిని తరలించాల్సి వస్తే సంబంధిత రెవెన్యూ, ఇరిగేషన్ అధికారుల నుంచి అనుమతులు తీసుకోవాలని తెలిపారు.

డబ్బులు తీసుకుని చక్కెర ఇవ్వడం లేదు

● వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఓ వ్యాపారి ఫిర్యాదు

అనంతపురం క్రైం, జూన్ 30(ఆంధ్రజ్యోతి): వ్యాపారంలో భాగంగా చక్కెర కొనుగోలు చేస్తే.. సక్రమంగా సప్లై చేయకుండా ఆపేశాడని, తనకు న్యాయం చేయాలంటూ ఒక వ్యాపారి అనంతపురం వన్‌టౌన్ పోలీసులను సోమవారం ఆశ్రయించాడు. పోలీసులు తెలిపిన సమాచారం మేరకు.. హర్యానాకు చెందిన బన్సల్ దగ్గర పాతూరుకు చెందిన కిరణ్‌కుమార్ సుమారు 50 టన్నుల వరకూ చక్కెర కొనుగోలు చేశాడు. ఈ క్రమంలో రూ.1.50 కోట్ల నుంచి రూ. 2 కోట్ల వరకూ బన్సల్‌కు వివిధ రూపేణా చెల్లించాడు. కొంత చక్కెరను లారీలలో పంపిన తర్వాత కొంత కాలానికి చక్కెర సప్లై చేయడం ఆపేశాడు. ఎంత అడిగినా బన్సల్ స్పందించకపోవడంతో...బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

రూరల్ సబ్‌రిజిస్ట్రార్ ఉద్యోగ విరమణ

అనంతపురం కలెక్టరేట్, జూన్ 30(ఆంధ్రజ్యోతి): అనంతపురం రూరల్ సబ్‌రిజిస్ట్రార్ శ్రీరాములు ఉద్యోగ విరమణ పొందారు. సోమవారం చివరి రోజు విధులకు హాజరై రిలీవ్ అయ్యారు. ఆయన స్థానంలో ఇంకా ఎవరినీ నియమించలేదు. ఇన్‌చార్జిగా సీనియర్ అసిస్టెంట్ టీజీ రెడ్డిని నియమించారు. కాగా అక్కడ పనిచేస్తున్న సీనియర్ అసిస్టెంట్ టీజీ రెడ్డికి ఇన్‌చార్జి ఇవ్వకూడదంటూ కొందరు జిల్లా ఉన్నతాధికారులకు ప్రజాసమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు అందజేసినట్లు సమాచారం.

స్టాంపుల వ్యవహారంలో విజయవాడకు డీఐజీ, డీఆర్

కళ్యాణదుర్గంలో ఈ స్టాంపుల కుంభకోణం కలకలం రేపిన విషయం తెలిసిందే. ఈ విషయంలో స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు డీఐజీ విజయలక్ష్మి, ఇన్‌చార్జి డీఆర్ శ్రీనివాసులు విజయవాడ వెళ్లారు. వారు తిరిగి బుధవారం రానున్నట్లు తెలిసింది.

ఉద్యోగ విరమణ పొందిన వారికి సన్మానం

ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగులను కలెక్టరేట్‌లోని రెవెన్యూభవన్‌లో ఘనంగా సన్మానించారు. సోమవారం ఆ సన్మాన సభలో కలెక్టర్, వినోద్ కుమార్, అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహార్, డీఆర్ఓ మలోల పాల్గొన్నారు. తహసీల్దార్ ఈశ్వరయ్యశెట్టి, సీఎస్డీటీ, ఆర్ఎస్డీటీ, వీఆర్ఓ తదితర 39మంది అధికారులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సీపీఓ అశోక్‌కుమార్, పశుసంవర్థక శాఖ జేడీ వెంకటస్వామి, ఏఓ అలెగ్జాండర్, వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

డెంగీ నిర్మూలనపై అవగాహన కల్పించాలి

● వైద్య ఆరోగ్య సిబ్బందికి కలెక్టర్ ఆదేశం



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్, అధికారులు

అనంతపురం కలెక్టరేట్, జూన్ 30(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా ఈనెల 31వ తేదీ వరకు డెంగీ నిర్మూలనపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ వినోద్‌కుమార్ వైద్య ఆరోగ్య సిబ్బందిని ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో సోమవారం ఆయన డీఆర్వో మలోల, అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహార్‌తో కలిసి జాతీయ డెంగీ మాసోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ... ప్రజలు డెంగీ బారిన పడకుండా చూడాల్సిన బాధ్యత వైద్యఆరోగ్య సిబ్బందిపై ఉందన్నారు. వారు గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బంది, ఆశా కార్యకర్తలతో కలిసి ప్రతి గ్రామంలో ఇంటింటికి వెళ్లి డెంగీ వ్యాధి ఎలా సోకుతుంది..?, దాని లక్షణాలు ఎలా ఉంటాయి..?, దానిని ఎలా నివారించాలో ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అలాగే వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతపై తెలియజేయాలన్నారు. ప్రతి శుక్రవారం డ్రైడేను పాటించేలా చూడాలన్నారు. నిత్యం జ్వరం వస్తుంటే రక్త పరీక్షలు చేయించుకునేలా ప్రజలను చైతన్యం చేయాలని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి ఓబులు, ఆరోగ్య విస్తరణ అధికారి గిరిధర్‌రెడ్డి, మలేరియా సబ్ యూనిట్ అధికారి మద్దయ్య, సూపర్‌వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

శ్రీరామిరెడ్డి కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న కార్మికులు, సీఐటీయూ నాయకులు

అనంతపురం టౌన్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): సమస్యలు పరిష్కరించాలంటూ శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం కార్మికులు గత 85 రోజులుగా చేస్తున్న సమ్మెను విరమింపజేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్ డిమాండ్ చేశారు. శ్రీరామిరెడ్డి కార్మికుల సమస్యల పరిష్కారాన్ని కోరుతూ సోమవారం ఆయన కార్మికులతో కలిసి కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టర్ వినోద్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ధర్నాకు సీఐటీయూతోపాటు మున్సిపల్ కార్మికులు, ప్రభుత్వ సర్వజనాస్పత్రి శానిటేషన్ కార్మికులు, హమాలీలు తదితర రంగాలవారు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా నాగేంద్రకుమార్ మాట్లాడుతూ... చేసిన పనికి వేతనాలు చెల్లించాలని గత 85 రోజులుగా కార్మికులు చేస్తున్న నిరవధిక సమ్మెపట్ల ప్రభుత్వం ఉదాసీన వైఖరిని పాటించడం బాధాకరమన్నారు. ఇప్పటికైనా కార్మికుల సమస్యలను పరిష్కరించాలన్నారు. లేనిపక్షంలో ప్రత్యక్ష ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. సీఐటీయూ నాయకులు గోపాల్, ముర్తుజా, వెంకటనారాయణ, శ్రీనివాసులు, తిరుమలేష్, ఎర్రిస్వామి, లక్ష్మీనరసింహ, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే చొరవతోనే రేమండ్ పరిశ్రమ రాక

● సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న టీడీపీ నాయకులు

రాప్తాడు, జూన్30(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే పరిటాల సునీత చొరవతోనే రాప్తాడులో జాకీ పరిశ్రమ స్థానంలో రేమండ్ పరిశ్రమ ఏర్పాటు కాబోతోందని టీడీపీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. రూ. 330 కోట్ల పెట్టుబడితో 3 వేల మందికి ఉపాధి కల్పించేలా రాప్తాడు వద్ద రేమండ్ పరిశ్రమ ఏర్పాటు కాబోతుండటంతో టీడీపీ నాయకులు సంబరాలు జరుపుకున్నారు. స్థానిక టీడీపీ కార్యాలయం నుంచి ద్విచక్రవాహనాల్లో ర్యాలీగా వెళ్లి రేమండ్ పరిశ్రమ ఏర్పాటయ్యే ప్రదేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్, రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో కన్వీనర్ కొండప్ప, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, సర్పంచులు తిరుపాలు, శీనయ్య, ఉజ్జినప్ప, ఎంపీటీసీలు జాఫర్, రవి, కిష్టా, సాకే జయరాముడు, రాప్తాడు బీరన్న, మరూరు గోపాల్, యర్రగుంట నారాయణస్వామి, రామాంజినమ్మ, రాము తదితరులు పాల్గొన్నారు.

నేతన్న నేస్తం అందించాలని వినతి

శింగనమల, జూన్ 30(ఆంధ్రజ్యోతి): నేతన్న నేస్తం కింద ప్రతి చేనేత కార్మికుడికి రూ.36వేలు అందజేయాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు డీ.చిన్నప్పయాదవ్, మండల అధ్యక్షుడు నేసే మధు కోరారు. మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం వారు చేనేత కార్మికుల సమస్యలు పరిష్కరించాలంటూ ధర్నా చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఎన్నికలలో ఇచ్చిన హామీ మేరకు కూటమి ప్రభుత్వం చేనేతలకు నేతన్న నేస్తం అందించాలని అన్నారు. అనంతరం తహసీల్దార్ శేషారెడ్డికి వినతి పత్రం అందజేశారు. నాయకులు మధుయాదవ్, గురు, మధురెడ్డి, చంద్ర, చికెన్‌బాషా,చేనేత కార్మికులు పాల్గొన్నారు

అన్నదాతా సుఖీభవను వెంటనే అందజేయాలి: సీపీఐ

గార్లదిన్నె, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పథకాన్ని రైతులకు వెంటనే అందజేయాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. మండలకేంద్రంలోని రైతు సేవా కేంద్రంలో సోమవారం వారు వ్యవసాయ శాఖ అధికారులను కలిసి మాట్లాడారు. పంటల సాగుకోసం రైతులకు అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రూ.20వేలు అందజేస్తామని కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు హామీ ఇచ్చిందన్నారు. ఇప్పుడు ఖరీఫ్ సీజన్ ప్రారంభమవడంతో రైతులు పంటల సాగుకు సిద్ధమయ్యారన్నారు. పెట్టుబడి కోసం ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పథకం డబ్బులను వారి ఖాతాల్లోకి తక్షణమే జమచేయాలని డిమాండ్ చేశారు. అనంతరం వినతిపత్రాన్ని వ్యవసాయ విస్తరణ అధికారి శ్రీవాణికి అందజేశారు. నాయకులు శ్రీనాథ్‌చౌదరి, రాముడు, శంకర్, నల్లప్ప, సుబ్బరాయుడు పాల్గొన్నారు.

ఇంజనీరింగ్ కార్మికులకు న్యాయం చేయండి



ఏఐటీయూసీ నాయకులతో కలిసి ఆందోళన చేస్తున్న మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు

అనంతపురం విద్య, జూన్ 30(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీలలో పనిచేస్తున్న ఇంజనీరింగ్ కార్మికులకు న్యాయం చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధానకార్యదర్శి రాజారెడ్డి డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోరుతూ మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు సోమవారం స్థానిక జడ్పీ కార్యాలయం ఎదుట గల అంబేడ్కర్ విగ్రహం నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ చేపట్టి అక్కడ ఆందోళన చేపట్టారు. ఇందులో రాజారెడ్డి పాల్గొని మాట్లాడారు. మున్సిపాలిటీలలో పనిచేస్తున్న ఇంజనీరింగ్‌కార్మికుల జీవితాలు రోజురోజుకు దుర్భరంగా మారుతున్నాయన్నారు. వేతనాలు రాకపోవడంతో కుటుంబాలను పోషించలేకున్నారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఇంజనీరింగ్ కార్మికులకు వేతనాలు పెంచాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్‌వర్కర్స్‌యూనియన్ జిల్లా ప్రధానకార్యదర్శి రాజేష్‌గౌడు,నగరప్రధాన కార్యదర్శికృష్ణుడు,నాయకులు చిరంజీవి, వేణుగోపాల్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

4 నుంచి సమ్మె ఉధృతం చేస్తాం..

అనంతపురం క్లాక్‌టవర్: మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, లేదంటే ఈనెల 4వతేదీ నుంచి సమ్మె ఉధృతం చేస్తామని ఏపీ మున్సిపల్ ఇంజనీరింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు భాస్కర్‌రెడ్డి, లోకేష్‌నాయుడు తెలిపారు. నగరపాలక సంస్థలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వారు ఈ మేరకు డిప్యూటీ కమిషనర్ పావని, సెక్రటరీ రంగస్వామికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఇంజనీరింగ్ కార్మికులు సూర్యనారాయణ, నూర్‌భాషా, పుల్లయ్య, సురేషబాబు, జగదీష్, రవిశంకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోవాలి

కనగానపల్లి, జూన్ 30(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని మోడల్‌స్కూల్ ప్రిన్సిపాల్ విద్యార్థుల అడ్మిషన్ సీట్లు అమ్ముకుంటున్నారని ఆ పాఠశాల వైస్‌చైర్మన్ వీడియో సోషల్ మీడియాలో పోస్టు చేయడంతో సోమవారం వైరలైంది. మోడల్‌స్కూల్లో ప్రిన్స్‌పాల్ రవికుమార్ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తూ నిరుపేద విద్యార్థులకు అన్యాయం చేస్తున్నారని ఆ పాఠశాల వైస్‌చైర్మన్ పోతలయ్య వీడియో తీసి సోషల్‌మీడియాలో పోస్టుచేసి స్థానిక ఎమ్మెల్యే, ప్రజాప్రతినిధులు వీటిపై దృష్టిపెట్టాలని కోరారు. ఈ విషయంపై ప్రిన్సిపాల్‌ను వివరణ కోరగా బాలికల హాస్టల్‌లో పరిమితంగా సీట్లు ఉన్నాయని, ఆ విషయం తెలపడంతో ఇలా ఆరోపణలు చేశారని అన్నారు.

ఎస్కేయూకు యూజీసీ నోటీసులు

అనంతపురంరూరల్, జూన్30(ఆంధ్రజ్యోతి): ర్యాగింగ్ నిరోధక నిబంధనలు పాటించడంలో విఫలమైనందుకు శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయానికి యూజీసీ (యూనివర్శిటీ గ్రాంట్స్ కమిషన్) నోటీసులు జారీ చేసింది. దేశంలో పలు ఐఐఎం, ఐఐటీలతోపాటు 89 సంస్థలకు యూజీసీ నోటీసులు ఇచ్చింది ఈ జాబితాలో శ్రీకృష్ణదేవరాయ యూనివర్శిటీ కూడా ఉండటం గమనార్హం. ఆ మేరకు నెలరోజుల వ్యవధిలో వివరణ ఇవ్వాలని నోటీసుల్లో పేర్కొన్నారు. ఇదిలా ఉండగా నోటీసుల విషయమై ఎస్కేయూ రిజిస్ట్రార్ రమేష్‌బాబును వివరణ కోరగా..నోటీసులు వచ్చిన విషయం వాస్తవమేనని, గత 20 రోజుల కిందట నోటీసులు వచ్చాయని, ఆమేరకు యూజీసీకి వివరణ ఇచ్చామని తెలిపారు.

అర్జీల వెల్లువ

అనంతపురంకలెక్టరేట్, జూన్30(ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదికలో అర్జీలు వెల్లువెత్తాయి. జిల్లా ప్రజలు ఏకంగా 660 వినతులు సమర్పించారు. వాటిని స్వీకరించిన కలెక్టర్ వినోద్‌కుమార్.. బాధితులతో మాట్లాడారు. అర్జీలను సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, తక్షణమే పరిష్కారం చూపాలని ఆదేశించారు.

6 నెలల జైలు శిక్ష

అనంతపురం క్రైం, జూన్ 30(ఆంధ్రజ్యోతి): కారుతో ర్యాష్ డ్రైవింగ్ చేస్తూ... ఢీ కొట్టినందుకు ఓ ముద్దాయికి ఆరు నెలల జైలు శిక్ష, రూ.1000 జరిమానా విధించారు. ఈ మేరకు 2వ స్పెషల్ మేజిస్ట్రేట్ కోర్టు న్యాయాధికారి సుబ్బారావు సోమవారం తీర్పును వెలువరించారు. అనంతపురం రూరల్ మండలం సిండికేట్ నగర్‌కు చెందిన శంకర్‌రెడ్డి(37) అనే వ్యక్తి 2021 జూలై 20వ తేదీన టయోటా ఇటియోస్ కారుతో నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేస్తూ యాక్సిడెంట్ చేశాడంటూ లక్ష్మీప్రియాంక అనే మహిళ ఫిర్యాదు చేసింది. దీంతో రూరల్ ఎస్ఐ నబీరసూల్ కేసు నమోదు చేశారు. విచారణ తర్వాత కోర్టులో చార్జి షీట్ దాఖలు చేశారు. ఈ కేసుపై 2వ స్పెషల్ మేజిస్ట్రేట్ న్యాయాధికారి టీవీ సుబ్బారావు 8 మంది సాక్షులను విచారించి, నేరం రుజువు కావడంతో శంకర్‌రెడ్డికి శిక్ష విధిస్తూ... తీర్పు ఇచ్చారు.

విద్యాసామగ్రి పంపిణీ

రామగిరి, జూన్ 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని గంతిమర్రి పంచాయతీలో గల గంతిమర్రి, కలికి వాండ్లపల్లి, పెనుబోలు గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు సోమవారం యూటీఎఫ్ నాయకులు నోట్‌పుస్తకాలు, విద్యాసామాగ్రిని పంపిణీ చేశారు. జిల్లా అధ్యక్షుడు శెట్టిపి జయచంద్రారెడ్డి, గంతిమర్రి పాఠశాల విద్యాకమిటీ చైర్మన్ అక్కులప్ప, వైస్‌చైర్మన్ లక్ష్మీదేవి, యూటీఎఫ్ మండల అధ్యక్షుడు బాలగొండ్ల శివయ్య, నాయకులు పాల్గొన్నారు.

డీలర్ల సంఘం మండల కమిటీ ఎన్నిక

అనంతపురంరూరల్, జూన్ 30(ఆంధ్రజ్యోతి): రేషన్ డీలర్ల సంఘం మండల కమిటీ ఎన్నిక నగరంలోని ఎమ్మెల్యే పరిటాల సునీత క్యాంపు కార్యాలయంలో సోమవారం జరిగింది. ఇందులో టీడీపీ మండల అధ్యక్షుడు జింకాసూర్యనారాయణ, ప్రధాన కార్యదర్శి షెక్షావలి నాయుడు, క్లస్టర్ ఇన్‌చార్జులు పాముదాయి రఘు, రాగేమురళి, జయకృష్ణ, తెలుగుయువత రాప్తాడు నియోజకవర్గ అధ్యక్షుడు మద్దినేని కృష్ణ ఆధ్వర్యంలో మండలంలోని డీలర్లు అధ్యక్షుడిగా జెట్టి భరత్ చౌదరిని, ఉపాధ్యక్షులుగా మండల చంద్రశేఖర్, వెంకటేష్, సభ్యులుగా మారుతి, ధనలక్ష్మి, రామును ఎన్నుకున్నారు.

కడపతో అనంత మ్యాచ్ డ్రా

● మరో మ్యాచ్‌లో కర్నూలుపై చిత్తూరు విజయం

● ఒకేరోజు మూడు సెంచరీలు నమోదు



అభిషేక్ రెడ్డి, ధరణీకుమార్, ప్రదీప్, జయవర్ధన్

అనంతపురం క్లాక్‌టవర్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): కడపతో జరిగిన పోరులో అనంతపురం జట్టు డ్రాగా ముగించింది. ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ సౌత్‌జోన్ సీనియర్ మల్టీడే రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలు ఆదివారం స్థానిక అనంత క్రికెట్ మైదానంలో ముగిశాయి. అనంతపురం, కడప జట్ల మధ్య జరిగిన పోటీల్లో మొదటి ఇన్నింగ్స్‌లో కడప 76.5ఓవర్లలో 273పరుగులకు ఆలౌట్ అయ్యింది. మొదటి ఇన్నింగ్స్‌లో అనంతపురం 87.1ఓవర్లలో 374పరుగులకు ఆలౌట్ అయ్యింది. రెండో ఇన్నింగ్స్‌లో కడప 95ఓవర్లలో 421పరుగులకు ఆలౌట్ అయ్యింది. ఇందులో కడప బ్యాటర్లు జయవర్ధన్ 115 పరుగులు, ధృవ్‌కుమార్ రెడ్డి 75పరుగులు చేశారు. అనంత బౌలర్ ప్రదీప్ 5వికెట్లు తీశాడు. అనంతపూర్ ఇన్నింగ్స్ లీడ్‌లో ఉండగా చివరి రోజు కావడంతో డ్రాగా ముగించారు. అనంతపురం జట్టుకు 3పాయింట్లు, కడప జట్టుకు ఒక పాయింట్ దక్కింది. ఇక రాయలసీమ క్రికెట్ గ్రౌండ్‌లో జరిగిన మ్యాచ్‌లో కర్నూలు, చిత్తూరు జట్లు తలపడగా కర్నూలు మొదటి ఇన్నింగ్స్‌లో 71.5ఓవర్లలో 250పరుగులకు ఆలౌట్ అయ్యింది. మొదటి ఇన్నింగ్స్‌లో చిత్తూరు 34.5ఓవర్లలో 120పరుగులకు ఆలౌట్ అయ్యింది. రెండో ఇన్నింగ్స్‌లో కర్నూలు 42.2ఓవర్లలో 118పరుగులకు ఆలౌట్ అయ్యింది. రెండో ఇన్నింగ్స్‌లో చిత్తూరు 49ఓవర్లలో 3వికెట్లు కోల్పోయి 249పరుగులు చేసి 7వికెట్ల తేడాతో విజయం సాధించింది. చిత్తూరు బ్యాటర్లు అభిషేక్ రెడ్డి (117), ధరణికుమార్ (108) పరుగులతో జట్టును విజయతీరాలకు చేర్చారు. చిత్తూరుకు 6పాయింట్లు దక్కాయి. కార్యక్రమంలో జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి భీమలింగారెడ్డి, సహాయ కార్యదర్శి మురళీ కృష్ణ, కోశాధికారి షబ్బీర్‌అహ్మద్, సీనియర్ ప్లేయర్లు పాల్గొన్నారు.

పోలీస్ గ్రీవెన్స్‌కు 91 అర్జీలు



సమస్యలు వింటున్న ఎస్పీ జగదీష్

అనంతపురం క్రైం, జూన్ 30(ఆంధ్రజ్యోతి): నగరంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజలు వివిధ సమస్యలకు పరిష్కారం కోరుతూ 91 వినతి పత్రాలు ఇచ్చారు. ఎస్పీ జగదీష్ వాటిని స్వీకరించారు. పిటీషన్లపై విచారణ చేసి బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని సంబంధిత పోలీస్ అధికారులను ఆదేశించారు. డీఎస్పీలు శ్రీనివాసరావు, వెంకటేషులు తదితరులు పాల్గొన్నారు.

రిటైర్డ్ పోలీస్ అధికారులకు ఎస్పీ సన్మానం

అనంతపురం క్రైం: ఉద్యోగ విరమణ పొందిన ఎస్ఐలు రఫీక్, మసూద్ వలి, వెంకటేశ్వర్లు, ఏఆర్ ఎస్ఐ గంగాధర్, హెడ్ కానిస్టేబుళ్లు బషీరుల్లాకు సన్మాన కార్యక్రమం డీపీఓలోని కాన్ఫరెన్స్ హాల్‌లో సోమవారం జరిగింది. ఇందుకు ఎస్పీ జగదీష్ ముఖ్యఅతిథిగా హాజరై పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. అనంతరం మాట్లాడుతూ.. ఇన్నాళ్లు వారు పోలీస్ శాఖకు అందించిన సేవలు అభినందనీయమని కొనియాడారు. ఇప్పటి నుంచి ప్రశాంత జీవనం కొనసాగించాలని ఆకాంక్షించారు. ఏఆర్ అదనపు ఎస్పీ ఇలియాస్ బాషా, ఆర్ఐ మధు, సూపరింటెండెంట్ ప్రసాద్, జిల్లా పోలీసు అధికారుల సంఘం అడహక్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పాడి రైతులకు మెరుగైన సేవలు

అనంతపురం అర్బన్, జూన్ 30(ఆంధ్రజ్యోతి): పాడి రైతులకు మెరుగైన సేవలు అందించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని పశుసంవర్థక శాఖ జేడీ సుధాకర్ పేర్కొన్నారు. జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ డీడీగా పనిచేస్తున్న సుధాకర్‌ను పశుసంవర్థక శాఖ జేడీ (ఎఫ్ఏసీ)గా నియమించారు. ఇక్కడ జేడీగా పనిచేసిన వెంకటస్వామి సోమవారం సాయంత్రం రిటైర్డ్ అయ్యారు. ఈ నేపథ్యంలో పశుసంవర్థక శాఖ జేడీగా సుధాకర్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... అధికారులు, ఉద్యోగులను సమన్వయం చేసుకొని ముందుకు వెళతానన్నారు.

పీఆర్ ఈఈకే ఎస్ఈ ఇన్‌చార్జి బాధ్యతలు

అనంతపురం న్యూటౌన్, జూన్ 30(ఆంధ్రజ్యోతి): పంచాయతీరాజ్ ఈఈ ప్రభాకర్‌రెడ్డికే ఎస్ఈ ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. ఇప్పటి వరకు ఉన్న ఎస్ఈ జహీర్ అస్లాం సోమవారం రిటైర్డ్ అయ్యారు. దీంతో ఆ బాధ్యతలను ఈఈ ప్రభాకర్‌రెడ్డికి అప్పగించారు. అయితే ఈఈ ప్రభాకర్‌రావు ఇప్పటికే పీఐయూ ఇన్‌చార్జి ఈఈగా కూడ అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఎస్ఈ అదనపు బాధ్యతలు అప్పగించడంతో పీఐయూ ఇన్‌చార్జి ఈఈగా చిత్తూరు పీఆర్‌లో డీఈఈ గా ఉన్న నవీన్‌కుమార్ ను నియమించారు. పదోన్నతుల ప్రక్రియ పూర్తి అయితే రెగ్యూలర్ ఈఈగా నవీన్‌కుమార్‌నే నియమించే అవకాశం ఉన్నట్లు చర్చ జరుగుతోంది. రెగ్యులర్ ఎస్ఈగా సుబ్బరాయుడును నియమించే అవకాశం ఉన్నట్లు చర్చ జరుగుతోంది.

బాలాజీనాయక్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు

అనంతపురం అర్బన్, జూన్ 30(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ శాఖ జేడీ కార్యాలయ అడ్మినిస్ట్రేటివ్ అధికారిగా బాలాజీనాయక్ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడి అధికారిణి సుజాత సోమవారం రిటైర్డ్ అయ్యారు. దీంతో సూపరింటెండెంట్ బాలాజీనాయక్‌ను ఇన్‌చార్జిగా నియమించారు. అలాగే మత్స్య శాఖ డీడీ కార్యాలయంలో ఎఫ్‌డీఓగా పనిచేస్తున్న పక్కీరయ్య రిటైర్డ్ అయ్యారు. ఆయన స్థానంలో బీటీపీ ప్రాజెక్టు ఎఫ్‌డీఓ హాసీప్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. సిరికల్చర్‌లో ఫీల్డ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న కృష్ణమూర్తి రిటైర్డ్ అయ్యారు.

జేడీ వెంకటస్వామికి సన్మానం



వెంకటస్వామి దంపతులను సన్మానిస్తున్న అధికారులు, సిబ్బంది

అనంతపురం అర్బన్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): పశుసంవర్థక శాఖ జేడీ వెంకటస్వామి సోమవారం ఉద్యోగ విరమణ పొందారు. ఇందుకు స్థానిక పశుసంవర్థక శాఖ జేడీ కార్యాలయ ఆవరణలో ఆ శాఖ అధికారులు, సిబ్బంది ఘనంగా సన్మానం చేశారు. వెంకటస్వామి దంపతులను పూల మాలలు, శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా వెంకటస్వామి మాట్లాడుతూ... విధి నిర్వహణలో తనకు సహకరించిన అధికారులు, ఉద్యోగులు, సిబ్బందికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

15వ ఆర్థిక సంఘం నిధులను విడుదల చేయండి

శింగనమల, జూన్30(ఆంధ్రజ్యోతి): 15వ ఆర్థిక సంఘం నిధులను వెంటనే విడుదల చేసి పంచాయతీల అభివృద్ధికి సహకారం అందజేయాలని రాష్ట్ర పంచాయతీరాజ్ ఛాంబర్ కార్యనిర్వాహక కార్యదర్శి దేగల కృష్ణమూర్తి జాతీయ పంచాయతీరాజ్ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ వైవీబీ రాజేంద్రప్రసాద్‌ను కోరారు. కృష్ణాజిల్లా ఉయ్యూరులో సోమవారం ఆయన రాజేంద్రప్రసాద్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం మాట్లాడుతూ రాష్ట్రంలో పంచాయతీలు తక్కువ నిధులతో అభివృద్ధి కాలేకపోతున్నాయన్నారు. 15వ ఆర్థిక సంఘం నిధులతో పాటు నరేగా నిధులను కేంద్రం నుంచి వెంటనే పంచాయతీ ఖాతాలోకి విడుదల చేయడానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుడు నిట్టూరు శివాజి పాల్గొన్నారు.

నేడు బుక్కచెర్లకు ఎమ్మెల్యే రాక

రాప్తాడు, జూన్30(ఆంధ్రజ్యోతి): మండలంలోని బుక్కచెర్ల గ్రామంలో మంగళవారం జరిగే సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యే పరిటాల సునీత ముఖ్య అతిథిగా హాజరుకానున్నట్లు టీడీపీ మండల కన్వీనర్ కొండప్ప, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు సోమవారం ప్రకటనలో తెలిపారు. ఉదయం 9:30 గంటలకు మండల టీడీపీ నాయకులు, కార్యకర్తలు బుక్కచెర్ల గ్రామానికి హాజరై ఎమ్మెల్యే పర్యటనను విజయవంతం చేయాలని వారు కోరారు.

టీడీపీ సింగంపల్లి గ్రామ కమిటీ ఎన్నిక

ఆత్మకూరు జూన్ 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సింగంపల్లిలో సోమవారం టీడీపీ గ్రామ కమిటీ ఎన్నిక మండల అధ్యక్షుడు శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా జరిగింది. గ్రామ కమిటీ అధ్యక్షుడిగా రామక్రిష్ణ, ప్రధాన కార్యదర్శిగా పరుశురామ్‌తో పాటు సభ్యులను ఎన్నిక చేశారు. అలాగే సింగంపల్లి తండా కమిటీ అధ్యక్షుడిగా గోవిద్ నాయక్,ప్రధాన కార్యదర్శిగా వెంకటేష్‌నాయక్‌ను ఎన్నుకున్నారు. పార్టీ హిందూపురం పార్లమెంటు అధికార ప్రతినిధి శశాంక చౌదరి, మండల ప్రధాన కార్యదర్శి నరసింహచౌదరి తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



మోకాళ్లపై కూర్చుని నిరసన తెలుపుతున్న మున్సిపల్ కార్మికులు

గుత్తి, జూన్ 30(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట నల్లబ్యాడ్జీలను కళ్లకు గంతలు కట్టుకొని మోకాళ్లపై కూర్చొని వినూత్న నిరసన చేపట్టారు. నాయకులు మాట్లాడుతూ కార్మికులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, జీఓ నెంబర్ 36 మేరకు వేతనాలు ఇవ్వాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలను వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. సంఘం అధ్యక్షుడు రాజా, ఉపాధ్యక్షుడు మురళీ, ప్రధాన కార్యదర్శి రవిశంకర్, నాయకులు నరంసిహులు, ఆదినారాయణ, శేఖర్, సూర్యనారాయణ, రామాంజనేయులు పాల్గొన్నారు.

చలో విజయవాడను జయప్రదం చేయండి



బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న సీఐటీయూ నాయకులు

రాయదుర్గం రూరల్, జూన్ 30(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ 4వ తేదీన సీఐటీయూ ఆధ్వర్యంలో తలపెట్టిన చలో విజయవాడ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా సహాయ కార్యదర్శి మల్లికార్జున పిలుపునిచ్చారు. సోమవారం ఇంజనీరింగ్ కార్మికులతో కలిసి సీఐటీయూ ఆధ్వర్యంలో పట్టణంలో స్థానిక వినాయక కూడలి నుంచి లక్ష్మీబజార్, కణేకల్లు రోడ్డు, కేబీ ప్యాలెస్ రోడ్, నేతాజీరోడ్ మీదుగా శాంతినగర్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. యూనియన్ అధ్యక్షుడు తిప్పేరుద్ర, నాయకులు నరసింహులు, మైలారి శివానంద, శ్రీనివాసులు, రాము, పారిశుధ్య కార్మికులు రాము, తిప్పేస్వామి, మల్లేష్, విజయ్ పాల్గొన్నారు.

తెరుచుకోని సచివాలయం



ఒంటి గంటైనా తెరుచుకోని గ్రామ సచివాలయం

వజ్రకరూరు(ఉరవకొండ), జూన్ 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని గడేహోతూరులో సచివాయలం మధ్యాహ్నం ఒంటిగంటైనా తెరుచుకోలేదు. కార్యాలయానికి వేసిన తాళాలు అలాగే ఉన్నాయి. సచివాలయానికి ఉద్యోగులు తరచూ విధులకు దుమ్మాకొడుతున్నారని గ్రామస్థులు ఆరోపించారు. సచివాలయ ఉద్యోగుల తీరుపై గతంలో ఫిర్యాదు చేసినా పట్టించుకున్న దాఖలాలేవన్నారు. దీంతో ఉద్యోగులు ఆడిందే ఆట, పాడిందే పాటగా తయారైంది. ఈ విషయంపై ఎంపీడీవో శివాజీ రెడ్డిని వివరణ కోరగా కొంతమంది సిబ్బంది బదిలీలు, మరికొంత మంది పింఛన్ డబ్బు డ్రా చేసేందుకు వెళ్లారని తెలిపారు.

ఉపాధి హామీ పథకం బిల్లులు చెల్లించాలి

వజ్రకరూరు(ఉరవకొండ), జూన్ 30(ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న ఉపాధి హామీ పథకం బిల్లులు చెలించాలని వ్యకాస జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తి, ఉపాధ్యక్షుడు విరుపాక్షి డిమాండ్ చేశారు. స్థానిక తహసీల్దారు కార్యాలయంలో సోమవారం తహసీల్దారు నరేష్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. సుధాకర్, బ్రహ్మయ్య, ఎర్రిస్వామి పాల్గొన్నారు.

తహసీల్దార్‌గా ఈశ్వరమ్మ

శెట్టూరు, జూన్ 30(ఆంధ్రజ్యోతి): మండల తహసీల్దార్‌గా ఈశ్వరమ్మ సోమవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న తహసీల్దార్ ఈశ్వరయ్యశెట్టి సోమవారం పదవీ విరమణ పొందారు. ఆయన స్థానంలో కళ్యాణదుర్గం ఆర్డీవో ఆఫీసులో ఏవో విధులు నిర్వహిస్తున్న ఈశ్వరమ్మ ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఆమె మాట్లాడుతూ ప్రజలకు నిత్యం అందుబాటులో వుండి సేవలందిస్తామన్నారు.

ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్‌ఏను రెన్యువల్ చేయాలి

రాయదుర్గం రూరల్, జూన్ 30(ఆంధ్రజ్యోతి): నిరుపేదలకు నిస్వార్థంగా సేవలందిస్తున్న ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్‌ఏను రెన్యువల్ చేయాలని కొంతానపల్లి వాసులు మల్లికార్జున, చిదానంద, కులారప్ప కోరారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద సేవ్ ఆర్డీటీ అనే ఫ్లకార్డులతో నిరసన కార్యక్రమం చేపట్టారు. రాజు, బ్రహ్మయ్య, మంజునాథ్, సురేష్ పాల్గొన్నారు.

ఉరవకొండ: ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్‌ఏను రెన్యువల్ చేయాలని ఆర్డీటీ పరిరక్షణ సమితి సభ్యులు డిమాండ్ చేశారు. సేవ్ ఆర్డీటీ పేరుతో సోమవారం ర్యాలీ నిర్వహించారు. బంజారా సంఘం నాయకులు కేశవ్‌నాయక్ మాట్లాడుతూ ఆర్డీటీని రక్షించుకుకునేందుకు సమష్టిగా పోరాడదామన్నారు. అనంతరం తహసీల్దారు కార్యాలయంలో వినతి పత్రాన్ని అందజేశారు. సభ్యులు గోపాల్, ఆనంద్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

రాయదుర్గం రూరల్, జూన్ 30(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మాథ్స్(లెక్కల) అధ్యాపకుల పోస్టుకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ విజయలక్ష్మి సోమవారం తెలిపారు. కళాశాలలో జూనియర్ మ్యాథ్స్ అతిథి అధ్యాపకుల కోరం ఆసక్తి గల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. విద్యార్హత ఎమ్మెస్సీలో 50 పైబడి మార్కులు సాధించిన వారు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. జూలై 2న సాయంత్రం ఐదు గంటల లోపల దరఖాస్తును కళాశాల ఆఫీసులో అందజేయాలన్నారు. అభ్యర్థులకు 4వ తేదీన ఉదయం 10 గంటలకు డెమో క్లాసు నిర్వహిస్తామని, హాజరు కావాలన్నారు.

తాగేందుకు గుక్కెడు నీరివ్వండి

● ఖాళీ బిందెలతో రోడ్డెక్కిన మహిళలు



అంబేడ్కర్ విగ్రహం ఎదుట ఖాళీ బిందెలతో మహిళల నిరసన

కళ్యాణదుర్గం, జూన్ 30(ఆంధ్రజ్యోతి): తాగేందుకు గుక్కెడు నీరివ్వాలని మహిళలు ఖాళీ బిందెలు చేతపట్టుకుని రోడ్డుపై బైఠాయించి ఆందోళనకు దిగారు. శ్రీరామిరెడ్డి తాగునీటి కార్మికులు సమ్మెలో ఉండటంతో పట్టణంలోని పలు కాలనీలకు తాగునీరు సరఫరా కావడం లేదని మహిళలు వాపోయారు. సోమవారం సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి గోపాల్ ఆధ్వర్యంలో పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట ఖాళీ బిందెలు చేతపట్టుకుని మహిళలు బైఠాయించారు. అరగంటకుపైగా నిరసన చేపట్టారు. తాగేందుకు గుక్కెడు నీరివ్వాలంటూ నినాదాలు చేశారు. అంతలోనే వాహనాల రాకపోకలు నిలిచిపోవడంతో సీఐ యువరాజు, సీపీఐ కార్యదర్శి గోపాల్‌తో నిరసన విరమించుకోవాలని సూచించారు. నీరిచ్చేంతవరకు ఇక్కడి నుంచి వెళ్లేది లేదంటూ సీఐతో వాగ్వాదానికి దిగారు. అయినా కూడా అధికారులు పట్టించుకోకపోవడంతో అక్కడి నుంచి నేరుగా ఆర్డీవో కార్యాలయంకు వెళ్లి నిరసన వ్యక్తం చేశారు. స్పందించిన ఆర్డీవో వసంతబాబు మున్సిపల్ అధికారులతో చర్చించారు. రెండు రోజుల్లో తాగునీటిని సరఫరా చేస్తామని హామీ ఇవ్వడంతో వారు ఆందోళన విరమించారు.

గుంతకల్లుటౌన్: పట్టణంలోని పక్కీరప్ప కాలనీలో తాగునీటి కోసం ఖాళీ బిందెలతోమహిళలు, సీపీఐ నాయకులు సోమవారం నిరసన తెలిపారు. సీపీఐ నాయకుడు వీరభద్రస్వామి మాట్లాడుతూ మున్సిపల్ ఇంజనీరింగ్ వర్కర్లు సమ్మె చేయడంతో పట్టణంలో తాగునీటి సమస్య ఏర్పడిందన్నారు. ఐదు రోజుల నుంచి తాగునీరు వదలలేదన్నారు. వెంటనే సమస్యను అధికారులు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. గోపీనాథ్, వెంకటేష్, మధు, అనిల్, మహిళలు పాల్గొన్నారు.

కంబదూరు: మండలంలోని అండేపల్లిలో కొన్ని నెలలుగా తాగునీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్నామని, పరిష్కరించాలని మహిళలు ఆందోళనకు దిగారు. సోమవారం ప్రధాన రహదారిపై ఖాళీ బిందెలు చేతపట్టుకుని బైఠాయించారు. అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. వాహన రాకపోకలను నిలిపివేయడంతో రహదారి స్తంభించింది. శ్రీరామిరెడ్డి తాగునీరు కొన్ని నెలలుగా సరఫరా కాకపోవడంతో తాగునీటి సమస్య రోజురోజుకీ ఎక్కువైపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులు, మండల పరిషత్తు అధికారులు గ్రామానికి చేరుకుని వారి సమస్యను అడిగి తెలుసుకున్నారు. రెండు రోజుల్లో నీటిని సరఫరా చేస్తామని ప్రకటించడంతో వారు ఆందోళన విరమించారు.



రోడ్డుపై ఖాళీ బిందెలతో బైఠాయించిన అండేపల్లి మహిళలు

గ్రీవెన్స్‌కు రాని అధికారులకు నోటీసులు

కణేకల్లు, జూన్ 30(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ప్రతి సోమవారం నిర్వహించే గ్రీవెన్స్‌కు హాజరుకాని అధికారులకు నోటీసులు జారీ చేయనున్నట్లు తహసీల్దార్ బ్రహ్మయ్య తెలిపారు. సోమవారం జరిగిన గ్రీవెన్స్‌కు కేవలం వ్యవసాయ, ఐసీడీఎస్ అధికారులు మాత్రమే హాజరు కాగా మిగతా అధికారులు గైర్హాజరయ్యారు. అలాంటి అధికారులకు నోటీసులు జారీ చేసి తరువాత వచ్చే గ్రీవెన్స్‌కు అన్ని శాఖల అధికారులు ఖచ్చితంగా హాజరయ్యే విధంగా చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు.

చెత్త నుంచి సంపద తయారు చేయాలి

గుత్తి రూరల్, జూన్ 30(ఆంధ్రజ్యోతి): గ్రామాలల్లో చెత్తనుంచి సంపద తయారు చేయాలని జడ్పీ సీఈఓ శివశంకర్ సూచించారు. సోమవారం మండలంలోని తొండపాడు పంచాయతీలో చెత్త సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. పంచాయతీకి ఆదాయం చేకురాలంటే చెత్త వల్ల సంపద సృష్టించాలన్నారు. ఎంపీడీఓ ప్రభాకర్ నాయక్, ఈఓఆర్‌డీ నరసింహారెడ్డి, పంచాయతీ కార్యదర్శి ఎర్రిస్వామి పాల్గొన్నారు.

దారి ఏర్పాటు చేయండి

విడపనకల్లు, జూన్ 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని కేజీబీవీ పాఠశాలకు దారి ఏర్పాటు చేయాలని మాల మహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామంజనేయులు, దండోర ఎర్రిస్వామి తహసీల్దార్‌కు సోమవారం వినతిపత్రాన్ని అందించారు. వారు మాట్లాడుతూ గ్రామానికి దూరంగా మళాపురం గ్రామంలో కేజీబీవీ పాఠశాలను నిర్మించారన్నారు. కనీసం విద్యార్థులు వెళ్లటానికి దారి కూడా లేదని, ఏ అధికారి గాని, నాయకుడు గాని పట్టించుకోవటం లేదు అన్నారు. వెంటనే పాఠశాలకు దారి ఏర్పాటు చేయాలని వారు కోరారు.

ఆన్‌లైన్‌లో భూములను ఎక్కించాలని వినతి

ఉరవకొండ,జూన్30(ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్‌లో భూములను ఎక్కించాలని రైతులు విన్నవించారు. మండల పరిధిలోని షేక్షానుపల్లి గ్రామానికి చెందిన హుస్సేన్‌బీ అనే మహిళ పట్టాదారు పాసుపుస్తకం కోసం ఆన్‌లైన్‌లో భూములను ఎక్కించాలని అధికారుల చుట్టూ తిరుగుతున్నానని, పలుమార్లు ఈ విషయం తహసీల్దారు దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. నాభర్త మరణించాడని, అతని పేరుమీద ఉన్న సర్వే నంబర్ 205-1ఏలో 7.59 ఎకరాల భూమి ఉందని, దానికి సంబంధించి అన్ని డాక్యూమెంట్లు అందించినా భూమిని ఆన్‌లైన్‌లో ఎక్కించలేదని వాపోయారు. అలాగే వ్యాసాపురంకు సంబంధించిన సర్వేనెంబర్ 46-ఏ4 వన్నూరప్ప మీద ఉందని, సుశీలమ్మ పేరుమీద మార్చాలని మూడు సార్లు తహసీల్దారు కార్యాలయానికి వచ్చినా పట్టించుకోలేదన్నారు. ఇటీవల వ్యాసాపురంలో రీసర్వే పూర్తిచేశారని, తమకు న్యాయం చేయాలని బాధితులు కోరుతున్నారు.

సచివాలయం తనిఖీ

పుట్లూరు, జూన్30(ఆంధ్రజ్యోతి): మండలంలోని మడ్డిపల్లి సచివాలయాన్ని సోమవారం ఎంపీడీఓ అలివేలమ్మ తనిఖీ చేశారు. ఆమె మాట్లాడుతూ ప్రతి పథకానికి రికార్డులు తప్పనిసరిగా ఉండాలని సూచించారు. ప్రతి ఉద్యోగి బయోమెట్రిక్ హాజరు తప్పక వేయాలన్నారు. అనంతరం పలు రికార్డులను పరిశీలించారు.

నగదు సాయం

యాడికి, జూన్ 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని పచ్చారుమేకలపల్లి గ్రామానికి చెందిన పేద విద్యార్థిని చదువు కోసం లయన్స్‌క్లబ్ సభ్యురాలు అమిలినేని లక్ష్మీదేవి సోమవారం రూ.10వేల నగదు సాయం అందించారు. ఇంటర్‌లో మంచి మార్కులు సాధించి ఉన్నత విద్యకు ఇబ్బందులు ఎదుర్కొంటున్న దుర్గాభవాని అనే విద్యార్థినికి రూ.5వేలు సాయాన్ని అందజేశారు. మరో రూ.5వేలను మరొక పేద విద్యార్థికి అందజేయనున్నట్లు క్లబ్ సభ్యులు తెలిపారు. లయన్స్‌క్లబ్ ప్రెసిడెంట్ లక్ష్మీనారాయణశెట్టి, కులశేఖర్, ప్రసాద్, సూర్యనారాయణ, రాంమోహన్‌రెడ్డి, ఇస్మాయిల్ పాల్గొన్నారు.

'వ్యక్తిగత విమర్శలు చేయడం తగదు'

గుత్తి, జూన్ 30(ఆంధ్రజ్యోతి): వైసీపీ నాయకులు జనసేన పార్టీ నాయకులపై వ్యక్తిగత విమర్శలు చేయడం తగదని ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు పాటిల్ సురేష్, కార్యదర్శి బ్రహ్మయ్య అన్నారు. స్థానిక అర్‌అండ్‌బీ అతిథి గృహంలో సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. తమ నేత పవన్‌కల్యాణ్ ఆధ్వర్యంలో గ్రామీణ ప్రాంతాలు ఎంతో అభివృద్ధి చెందుతున్నాయన్నారు. వైసీపీ విధ్వంస పాలనకు చరమగీతంపాడారన్నారు. గుంతకల్లులో తమ నాయకుడు వాసగిరి మణికంఠ పట్ల వైసీపీ నాయకులు వ్యక్తిగత విమర్శలు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. పట్టణ జనరల్ సెక్రటరీ వెంకటపతి నాయుడు, గోరంట్ల నాగయ్య, మిద్దె ఓబులేసు, మురళీనాయక్, రమేష్, బాషా, రంగస్వామి, గోపాల్ పాల్గొన్నారు.

హత్యాయత్నం కేసులో నిందితుల అరెస్ట్

తాడిపత్రి, జూన్ 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని బోడాయిపల్లి గ్రామంలో నాలుగురోజుల క్రితం ఇరువర్గాల దాడి జరిగిన సంఘటనలో ఇరువురిని అరెస్ట్ చేసినట్లు సీఐ శివగంగాధర్‌రెడ్డి తెలిపారు. బోడాయిపల్లి గ్రామానికి చెందిన చిన్నకుళ్లాయప్ప, రంగనాథ్ ఇరువురు రెండు గుంపులుగా ఏర్పడి ఒకరికొకరు వేట కొడవళ్ల, కట్టెలు, క్రికెట్ బ్యాట్‌లతో దాడులు చేసుకొని రంగనాథతోపాటు మరో నలుగురికి గాయాలు జరిగిన సంఘటన విదితమే. చిన్నకుళ్లాయప్పకు రక్తగాయాలైన సంఘటన విదితమే. ఇందుకు సంబంధించి సోమవారం కడపరహదారిలోని టెక్ కళాశాల సమీపంలో బాలయ్య, జగదీష్‌లను అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. ఎస్ఐ ధరణీబాబు సిబ్బంది పాల్గొన్నారు. ఇదే కేసులో మరొక వర్గానికి చెందిన పృథ్వీరాజ్‌ను వీరాపురం సమీపంలో అరెస్ట్‌చేసినట్లు తెలిపారు.

వైసీపీ మద్దతుదారుడి ఇంటిపై దాడి

తాడిపత్రి, జూన్ 30(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పోరాటకాలనీలో వైసీపీ మద్దతుదారుడు రామకృష్ణ అలియాస్ కిట్టు ఇంటిపై ఆదివారం రాత్రి టీడీపీ మద్దతుదారుడు సుబ్రమణ్యంతోపాటు సుబ్బు మరికొంత మంది దాడిచేసి బీభత్సం సృష్టించారని రామకృష్ణ భార్య లక్ష్మీదేవి పోలీసులకు ఫిర్యాదుచేసింది. ఆమె తెలిపిన మేరకు రెండురోజులక్రితం పెద్దారెడ్డి తాడిపత్రికి రాకతో మద్దతుదారుడు రామకృష్ణ పెద్దారెడ్డి ఇంటివద్దకు వెళ్లాడు. ఇది మనసులో పెట్టుకొన్న కొందరు టీడీపీ మద్దతుదారులు రామకృష్ణ ఇంటిపై దాడిచేశారు. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

గుత్తిరూరల్, జూన్ 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని రజాపురం గ్రామాశివారులోని 67వ జాతీయ రహదారిపై సోమవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు గాయపడ్డాడు. నంద్యాల జిల్లా, ప్యాపిలికి చెందిన పురుషోత్తం గుంతకల్లు నుంచి ప్యాపిలికి బైక్‌పై వెళ్తుండగా రజాపురం గ్రామాశివారులోకి రాగానే బైక్ అదుపుతప్పి బోల్తా పడడంతో అతడు గాయపడ్డాడు. స్థానికులు గుర్తించి గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

రైలు నుంచి కింద పడి వ్యక్తికి..

గుత్తి, జూన్ 30(ఆంధ్రజ్యోతి): గుత్తి జీఆర్పీ పరిధిలోని పాతకొత్తచెరువు-గుత్తి రైల్వేస్టేషన్ మధ్య రైల్లో నుంచి కింద పడి శుద్దవనం అనే వ్యక్తి తీవ్రంగా గాయపడినట్లు రైల్వే పోలీసులు తెలిపారు. సోమవారం ఒరిస్సా రాష్ట్రానికి చెందిన శుద్దవనం అనే వ్యక్తి రైల్లో ప్రయాణిస్తూ డోర్ వద్ద నిలబడి ఉండగా పాతకొత్త చెరువు స్టేషన్ సమీపంలోకి రాగానే ప్రమాదవశాత్తు కిందపడి గాయపడ్డాడు. బాధితుడిని చికిత్స నిమిత్తం గుత్తిప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

గొర్రెల మందపై దూసుకెళ్లిన కారు

ఉరవకొండ, జూన్ 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని బూదగవి సమీపంలో సోమవారం తెల్లవారుజామున గొర్రెల మందపై కారు దూసుకెళ్లడంతో 15గొర్రెలు మృతి చెందగా మరో మూడు గాయపడ్డాయి. బూదగవికి చెందిన బసవరాజు ఉరవకొండలో జరిగే గొర్రెల మార్కెట్‌కు 40 గొర్రెలను తోలుకుని వెళ్తుండగా బళ్లారి వైపు నుంచి వస్తున్న కారు మందను ఢీకొట్టింది. రూ.2లక్షల వరకూ నష్టం వాటిలినట్లు బాధితుడు వాపోయాడు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

తాడిపత్రి, జూన్30(ఆంధ్రజ్యోతి): మండలంలోని కడపరహదారి పక్క ముళ్లపొదల్లో పేకాట ఆడుతున్న 13మందిని అరెస్ట్‌చేసి వారివద్ద నుంచి రూ.1,23,700 స్వాధీనం చేసుకున్నట్లు రూరల్ సీఐ శివగంగాధర్ రెడ్డి తెలిపారు. జిల్లాకేంద్రం నుంచి వచ్చిన స్పెషల్‌పార్టీ పోలీసులతో కలిసి దాడులు నిర్వహించామని, 13 మంది అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఆయన తెలిపారు.

విస్తృతస్థాయి సమావేశాన్ని విజయవంతం చేయండి

రాయదుర్గంరూరల్, జూన్ 30(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశానికి టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున వచ్చి విజయవంతం చేయాలని మండల కన్వీనర్ హనుమంతు పిలుపునిచ్చారు. పట్టణంలోని సీతారామ కళ్యాణ మండపంలో 10.30 గంటలకు నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశానికి ముఖ్యఅతిథిగా విప్ కాలవ శ్రీనివాసులు పాల్గొంటున్నట్లు ఆయన తెలిపారు. నాయకులు, క్లస్టర్ ఇన్‌చార్జిలు, బీఎల్‌ఏలు, సీనియర్ కార్యకర్తలు పాల్గొనాలని ఆయన కోరారు.

సాధారణ కౌన్సిల్ సమావేశం

తాడిపత్రి, జూన్ 30(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో సోమవారం మున్సిపల్ వైస్ చైర్మన్ షెక్షావలి అధ్యక్షతన సాధారణ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. సభ్యులందరికీ అజెండా చదివి వినిపించారు. మున్సిపాలిటీకి చెందిన భవనాలపై సౌరప్యానెల్ స్థాపనకు ఫేజ్-2 కింద రూ.1.37 కోట్ల ప్రణాళికలు రూపొందించారు. మున్సిపల్ కరెంట్ బిల్లు తగ్గించేందుకు, పునరుత్పత్తి వినియోగాన్ని ప్రోత్సహించేందుకు ఉపయోగపడనుంది. లక్ష 40వేలు కెపాసిటీ బిల్లుల కార్యక్రమం నిర్వహణకు కేటాయించారు. రూ.1.40 లక్షలు సమాచారం విద్య ప్రచారం కార్యక్రమాలకు కేటాయించారు. 15వ ఆర్థిక సంఘం నిధుల కింద 2021-22 1, 2వ విడతకు అన్‌టైడ్ గ్రాంట్ రూ.2.49 కోట్లు, టైడ్‌గ్రాంట్ రూ3.74 కోట్లు మంజూరయ్యారు. ఈ గ్రాంటుల ద్వారా అనేక పనుల కింద పేర్కొన్న విధంగా మంజూరయ్యాయి. తదితర అంశాలపై అజెండా చదివి వినిపించారు. మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ నేను కక్షపూరితంగా వ్యవహరించలేదని చట్టపరంగానే ముందుకు వెళుతున్నానన్నారు. ఇప్పటికే ఆకుల నాగిరెడ్డి, రమేష్‌రెడ్డి, ఫయాజ్‌బాషా, సర్ సీవీ రామన్ భాస్కర్‌రెడ్డి భవనాలు చట్టపరంగా వెళుతున్నానని, మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డి ఇల్లు కూడా చట్టపరంగానే ముందుకు వెళుతున్నానన్నారు. ఎలాంటి రాజకీయం లేదని ఆయన అన్నారు. రాజకీయం చేయాలంటే వేరే విధంగా ఉందన్నారు. తాము ఉన్నత కుటుంబం నుంచి వచ్చామనీ, తమకు తండ్రిగారు నేర్పిన పద్ధతుల వల్లే ఈ స్థాయిలో ఉన్నామన్నారు. రాజకీయం చేయాలే గానీ ఇళ్లలోకి వచ్చి మహిళలను బెదిరించడం కాదన్నారు. ఇలాంటి సంస్కృతి వారికే చెల్లు అని, వారి విజ్ఞతకే విడిచి పెడుతున్నానన్నారు. నేను ఎవరి జోలికి వెళ్లలేదని పార్టీలో కార్యకర్తలు ఉంటారని, ఏ కార్యకర్త జోలికి ఇంతవరకు వెళ్లలేదన్నారు.

నాలుగేళ్లలో అభివృద్ధి శూన్యం

రాయదుర్గం: నాలుగేళ్ల కాలంలో ఎలాంటి అభివృద్ధి జరుగలేదని కూటమి ప్రభుత్వం ఏర్పడ్డ ఏడాదికే రూ.3 కోట్ల నిధులు వచ్చాయని వైసీపీ కౌన్సిలర్లు అన్నారు. ఆ పనులను అన్ని వార్డులకు కేటాయించాలని డిమాండ్ చేశారు. సోమవారం మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో చైర్‌పర్సన్ పొరాళు శిల్ప అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం జరిగింది. వైసీపీ కౌన్సిలర్లు వార్డుల్లో నాలుగేళ్లలో ఎలాంటి అభివృద్ధి చేయలేకపోయామని ఇప్పుడైనా ఆ నిధులతో అన్ని వార్డులలో అభివృద్ధి చేయాలని కోరారు. 10 ఏళ్ల క్రితం ప్రభుత్వం ఇచ్చిన లేఅవుట్‌లను ఇప్పటికీ నిర్మించని స్థలాలను రద్దు చేసేలా నోటీసులు జారీ చేయడంపై మండిపడ్డారు. ప్రభుత్వ రిజర్వు స్థలాలను కబ్జాలు చేసి ఉంటే వాటిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అభివృద్ధి పనులకు సంబంధించి సమష్టిగా ముందుకెళ్లాలని తెలపారు. మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి, డీఈ సురేష్, కౌన్సిలర్లు ప్రశాంతి, జ్యోతి పాల్గొన్నారు.



రాయదుర్గం: సమావేశంలో మాట్లాడుతున్న కౌన్సిలర్లు



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి

వ్యాపారాన్ని అభివృద్ధి చేసుకోండి: చైర్మన్

తాడిపత్రి, జూన్ 30(ఆంధ్రజ్యోతి): మహిళలు తమ వ్యాపారాలను అభివృద్ధి చేసుకోవాలని మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి సూచించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సోమవారం ప్రభుత్వం ఏపీ సీడాప్ సంస్థ రాయితీ కింద అనేక వ్యాపారాలకు సంబంధించి యూనిట్లను మంజూరు చేసిందన్నారు. ఈ యూనిట్లను ప్రతి మహిళ సద్వినియోగం చేసుకొని వ్యాపారాన్ని అభివృద్ధి చేసుకొని కుటుంబానికి ఆసరాగా ఉండాలని ఆయన సూచించారు. ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో భర్తతోపాటు భార్య కూడా వ్యాపారంలో రాణించినట్లయితే ఆ కుటుంబానికి మరింత తోడ్పాటు అవుతుందన్నారు. అందువల్ల ప్రభుత్వం మహిళల కోసం ప్రత్యేక సబ్సిడీ కింద యూనిట్లు మంజూరు చేసిందన్నారు. ఈ యూనిట్ ద్వారా రుణాలు పొంది వ్యాపారాలు వృద్ధి చేసుకోవాలని సూచించారు. అగ్రికల్చర్ అండ్ ఆల్ బిజినెస్ డీన్ ప్రొఫెసర్ అనిల్‌కుమార్, సీడాప్ స్టేట్ మిషన్ మేనేజర్ విజయ్‌కుమార్, ఏపీ ఫుడ్ కార్పొరేషన్ సొసైటీ జోన్ మేనేజర్ భరత్, డీఆర్‌డీఏ తాడిపత్రి అసిస్టెంట్ కో ఆర్డినేటర్ వీరాస్వామి, సీడాప్ మెంబర్లు సూర్యనారాయణ, సుమన్, రఘునాథ్‌రెడ్డి, తులసీరాం పాల్గొన్నారు.

పనుల పరిశీలన: పట్టణంలోని పుట్లూరురోడ్డులో దుకాణాల యజమానులు పార్కింగ్ కోసం చేస్తున్న పనులను సోమవారం మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి పరిశీలించారు. వారితో ఆయన మాట్లాడుతూ రోడ్డు విశాలంగా ఉండడంతో వ్యాపారాలు కూడా బాగా జరుగుతాయన్నారు. షాపు ముందర పార్కింగ్ చేసుకున్నట్లయితే వాహనాల రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు ఉండవన్నారు. వీటివల్ల మీరు మీ వ్యాపారాలే అభివృద్ధి చెందుతాయన్నారు.